VISALANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం. 193

శ్రీ విమల ప్రసాద్ చాలిహా

అస్సాం కాంగ్రెసుపార్టీ నాయకుడుగా ఎన్నిక

గౌహాతి, డిసెంబరు 20

అస్సాం శాసనసభా కాంగ్రెసుపార్టీ నాయకుడుగా ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ విమల ప్రసాద్ చాలిహా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా వున్న శ్రీ విష్ణురామ్ మేధి పార్టీ నాయకత్వానికి రాజీనామాయివ్వడం వల్లనే మరల ఈ ఎన్నిక జరగవలసి వచ్చింది.

విశాలాంధ్ర

[illegible]

సంపుటి 6 ★ విజయవాడ శనివారం మార్గశిరం 30-1879 [డిసెంబరు 21-1957] ★ సంచిక 258



రెడ్ బర్డ్ - బాట్స్‌మన్, రెక్స్ పెన్నులు

B. S. INDUSTRIES
61, GOVT. GATE ROAD, LALBAUG, BOMBAY 12.

అంతర్జాతీయ ఉద్రిక్తతను పెంచడమే అమెరికా లక్ష్యం

అట్లాంటిక్ కూటమి సమావేశంలో ఇది ప్రస్ఫుటమయిందని కుజ్నెట్సోవ్ విమర్శ

రష్యాతో ద్విపక్ష సంప్రదింపులకు ఒప్పుకోరట

అమెరికా విదేశాంగ శాఖోద్యోగి వివరణ

పారిస్, డిసెంబరు 19

సోవియట్‌తో సంప్రదింపులకు అమెరికా సిద్ధమే. కాని ఆ సంప్రదింపులను తన మిత్రరాజ్యాలతో కలిసి సాగించేందుకుమాత్రమే సిద్ధమని అమెరికా విదేశాంగశాఖ ఉద్యోగి శ్రీ ఆండ్రూ బెర్డింగ్ నేడు విలేఖరులతో అన్నారు.

అమెరికా, సోవియట్ ప్రభుత్వాలు ద్విపక్ష సంప్రతింపులు జరపడం చాల ఫలప్రదం కాగలదని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రథమ కార్యదర్శి నికిటా కృశ్చేవ్ "న్యూ స్టేట్స్‌మన్ అండ్ నేషన్" అనే పత్రికకు ఒక లేఖ రాస్తూ సూచించిన విషయం పాఠకులకు తెలిసినదే

నిరాయుధీకరణ విషయమై సోవియట్ యూనియన్‌తో తిరిగి సంప్రతింపులు ప్రారంభించేందుకు కొత్తగా ప్రయత్నించాలని అట్లాంటిక్ కూటమిలో నిర్ణయం జరిగిన సందర్భంలో అమెరికాపై తక్కిన దేశాలు చాల ఒత్తిడి తేవలసి వచ్చిందని అమెరికన్ పత్రికల్లో ఒక వార్త వెలువడింది. దీనిని గురించి ప్రశ్నించగా, అది నిజం కాదని బెర్డింగ్ అన్నారు.

పాకిస్తాన్‌లోని తల్లిదండ్రులకు బిడ్డల అప్పగింత

భారత ప్రభుత్వౌదార్యం

లాహోర్, డిసెంబరు 19

పాక్ ఆక్రమిత కాశ్మీర్ మాజీ అధ్యక్షుడయిన గులామ్ అబ్బాస్‌కి అతని ఇద్దరు మనుమలనూ, ఒక మనుమరాలినీ భారతప్రభుత్వం నేడు తిరిగి అప్పగించింది.

వారితల్లి రాహత్ ఆరా; తండ్రి జగదీశ్ చందర్ (మతం మార్చుకొని ఖాలిద్ మహ్మద్ అయ్యాడు). వీరిద్దరూ పాకిస్తాన్‌కి వెళ్ళిపోయినప్పుడు పిల్లలు ముగ్గురూ మిగిలిపోయారు. తన పిల్లలను రప్పించుకొనే మార్గం మరొకటి లేదని నిర్ధారణ అయిన తరువాత రాహత్ ఆరా, తమ పిల్లలను తమకు అప్పగించవలసిందిగా అభ్యర్థిస్తూ నెహ్రూకు ఒక జాబు రాసింది.

ప్రధాని నెహ్రూ వెంటనే తగిన చర్యలు తీసుకున్నారు. ఆ ముగ్గురు పిల్లలూ ఇంతవరకూ అలహాబాద్‌లోని ఆనందభవన్‌లో ఉన్న జాతీయ శిశు మండలిలో ఉన్నారు. వారికింకా హిందూపేర్లే ఉన్నాయి. పెద్దవాడు ప్రేమ్ కుమార్, తొమ్మిదేళ్ళవాడు; రెండవవాడు రాజ్ కుమార్-ఆరేళ్ళు, మూడవది అనూరాధ – నాలుగేళ్ళు. వీరు తమ తల్లిదండ్రులకు పంపేముందు నెహ్రూ వారిని ఢిల్లీ రప్పించి, తన భవనంలో పదిహేను రోజులుంచుకొని మరీ పంపారు.

ఉస్మానియా ఉద్యోగుల సమ్మె

హైదరాబాద్, డిసెంబరు 19

ఉస్మానియా విశ్వవిద్యాలయం పనివారు సమ్మె ప్రారంభించి నెల గడిచింది. ఈవేళ 20 మందిని అరెస్టు చేశారు. మొత్తం 139 మంది సమ్మెదారులను ఇంతవరకు ప్రభుత్వం అరెస్టు చేసింది. విద్యార్థి శాఖ సభ్యులు రు 100/- లు సమ్మెదార్లకు విరాళం ఇచ్చారు. మరొక 10 బస్తాల బియ్యం కూడా వసూలైనాయి.

విభిన్న వ్యవస్థలుగల దేశాలతో అంగీకారం కుదుర్చుకునే ఉద్దేశమే దానికి లేదని ఖండన

న్యూయార్క్, డిసెంబరు 19

"ప్రపంచ ఉద్రిక్తతను తీవ్రం చేయడమే అమెరికా ప్రభుత్వ ఉద్దేశమనేది పారిస్‌లో ఇప్పుడు జరిగిన అట్లాంటిక్ కూటమి సమావేశాన్ని బట్టి మరొకసారి ప్రస్ఫుటమవుతూ ఉంద"ని సోవియట్ విదేశాంగశాఖ ఉపమంత్రి వాసిలీ కుజ్నెట్సోవ్ ఇక్కడ విమర్శించారు.

"ప్రపంచ ఉద్రిక్తతను తీవ్రం చేయడమే అమెరికా ప్రభుత్వ ఉద్దేశమనేది పారిస్‌లో ఇప్పుడు జరుగుతున్న అట్లాంటిక్ కూటమి సమావేశాన్ని బట్టి మరొకసారి ప్రస్ఫుటమవుతూ ఉంద"ని సోవియట్ విదేశాంగ శాఖ ఉపమంత్రి వాసిలీ కుజ్నెట్సోవ్ నేడిక్కడ విమర్శించారు.

న్యూయార్క్‌నుండి విమానంలో మాస్కో బయలుదేరుతూ ఆయన పత్రికావిలేఖరులతో ప్రసంగించారు.

తన వ్యవస్థకు భిన్నమైన రాజకీయ, సామాజిక వ్యవస్థలున్న దేశాలతో అంగీకారం కుదుర్చుకొనే అభిలాష అమెరికా ప్రభుత్వానికి ఏకోశానా లేనట్లుందని ఆయన అన్నారు.

మొన్న ఐరాస సమావేశంలో ఆమోదించిన బ్రిటిష్ - అమెరికన్ - ఫ్రెంచి సంయుక్త ప్రతిపాదన, నిరాయుధీకరణ విషయమై సంప్రతింపులకు ప్రాతిపదికగా ఎంతమాత్రమూ ఉపయోగపడజాలదని కుజ్నెట్సోవ్ అన్నారు.

ఆయుధ బలాల తగ్గింపునకూ, అణ్వాయుధాల నిషేధానికీ సంప్రతింపులు జరపడం పశ్చిమరాజ్యాలకు, అందులోనూ ముఖ్యంగా అమెరికాకు ఎంతమాత్రమూ ఇష్టంలేదనేది దీనిని బట్టి స్పష్టమన్నారు.

ఇప్పుడు సోవియట్ ఏమి చేయదలచుకుందని విలేఖరులు అడిగారు.

"నిరాయుధీకరణ, అణ్వాయుధాల నిషేధం, సాయుధబలాల్లో పెద్ద తగ్గింపులను సాధించేందుకు పోరాడడమే సోవియట్ విధానం. ఇప్పుడుకూడా సోవియట్ యీ విధానాన్నే కొనసాగిస్తుంది", అని ఆయన అన్నారు.

అంటే అర్థం నిరాయుధీకరణ సంప్రతింపుల్లో సోవియట్ తిరిగి పాల్గొంటుందనా అని విలేఖరులు అడిగారు.

కుజ్నెట్సోవ్ సమాధానం చెప్ప నిరాకరించారు.

అట్లాంటిక్ కూటమి నిర్ణయాలపై రష్యా ప్రభుత్వ ప్రకటన

సుప్రీం సోవియట్‌లో జరుగగలదు

మాస్కో, డిసెంబరు 19

ప్రస్తుత సుప్రీం సోవియట్ తొమ్మిదవ సమావేశం భారత కాలమానం ప్రకారం ఈవేళ మధ్యాహ్నం 12½ గంటలకు క్రెమ్లిన్ భవనంలో ప్రారంభమయింది. జాతులసభయూ సమావేశమయిందని టాస్ తెలిపింది.

పారిస్‌లో జరిగిన అట్లాంటిక్ కూటమి సమావేశం చేసిన నిర్ణయాలను గురించి ఈ సమావేశంలోనే ఒక ప్రకటన చేయవలసిందని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది.

అట్లాంటిక్ కూటమి సమావేశంలో జరిగిన చర్చలు ప్రసంగాలనుబట్టి నిరాయుధీకరణ సమస్య ప్రస్తుతం ఏ స్థితికి వచ్చిందో వివరించవలసిందిగా సుప్రీం సోవియట్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

అట్లాంటిక్ కూటమి సమావేశాన్ని గురించి వెలువడిన ప్రకటనలు చూస్తే, పశ్చిమ రాజ్యాల్లో వివిధ ముఠాలు అట్లాంటిక్ కూటమి ద్వారా ప్రచ్ఛన్న యుద్ధాన్ని కొనసాగించాలని అనుకుంటున్నట్లు విశదమవుతూందని ఈ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.

ప్రతినిధులసభ అధ్యక్షుడు పావెల్ లోబనోవ్ ఈ ప్రతినిధులకు జవాబు చెబుతూ, ఈ విషయమై సోవియట్ ప్రభుత్వం ఈ సమావేశంలోనే ఒక ప్రకటన చేయగలదన్నారు.

మాక్మిలన్‌పై విరుచుకు పడనున్న తుపాను

లండన్, డిసెంబరు 19

బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్ అట్లాంటిక్ కూటమి సమావేశం నుండి ఈవేళ రాత్రి లండన్ తిరిగి వస్తున్నారు. వచ్చీరావడంతోనే, అమెరికా అణు, రాకెట్ స్థావరాల విషయమై ఆయనపై ఒక తుపాను విరుచుకు పడబోతూందని అంతా అనుకుంటున్నారు.

స్కాట్లాండులో అమెరికన్ రాకెట్ స్థావరాలను నెలకొల్పడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒప్పుకున్నదని చెప్పి, పన్నెండుమంది పార్లమెంటు లేబరుపార్టీ సభ్యులు ఒక అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటుకు సమర్పించారు.

పారిస్ సమావేశ ఫలితాలను చర్చించేందుకు కామన్సు సభ రేపు సమావేశమవుతూంది.

అణ్వస్త్రాల నిల్వలపై అట్లాంటిక్ కూటమి సమావేశ ప్రకటన

పారిస్, డిసెంబరు 19

యూరప్‌లో మధ్యరకం ఖండాంతర రాకెట్ ఆయుధాలను, అణ్వస్త్రాల నిల్వలను ఏర్పర్చడానికి నిశ్చయించినట్లు అట్లాంటిక్ కూటమి శిఖరాగ్ర సమావేశం అంతిమ ప్రకటన వెల్లడించింది.

15 దేశాల అధిపతులు నేటి ఉదయం ఆఖరిసారిగా సమావేశమై ఈ అంతిమ ప్రకటనను ఆమోదించారు. అట్లాంటిక్ కూటమి దేశాల భద్రతనే గాక, మిగతా ప్రపంచం భద్రతను కూడా పెంపొందించే నిర్ణయాలను తీసుకున్నట్లు యీ ప్రకటనలో వివరించారు.

ప్రకటనలో ముఖ్యాంశాలు యివి:

(1) యూరప్‌లో అణ్వస్త్రాల నిల్వలను ఏర్పర్చడానికి అట్లాంటిక్ కూటమి నిర్ణయించింది. అవసరమైతే కూటమి రక్షణకు వీటిని వినియోగించవచ్చు.

(2) నూతన ఆయుధాలలో సోవియట్ విధానందృష్ట్యా, మధ్యరకం రాకెట్లను యూరప్‌లో అట్లాంటిక్ కూటమి సైన్యాధిపతికి అందజేయాలని నిశ్చయించారు.

(3) నిరస్త్రీకరణ సంఘంలో సోవియట్ తన స్థానం స్వీకరించటానికి నిరాకరించినట్లయితే, విదేశాంగ మంత్రుల స్థాయిలో సోవియట్‌తో చర్చలు జరపడానికి, అట్లాంటిక్ కూటమిలో కొన్ని దేశాలు సిద్ధపడతాయి.

(4) అట్లాంటిక్ కూటమి రక్షణ పథకాల దృష్ట్యా ఆయా దేశాలతో ఒప్పందాలు చేసుకుని, అణ్వస్త్రాలు, రాకెట్లు ఉండే విషయం నిర్ణయిస్తారు

(5) అట్లాంటిక్ కూటమి, అట్లాంటిక్ ప్రాంత ప్రయోజనాలను గాని, దాని సైనిక రక్షణను గాని, తన కార్యకలాపాలను పరిమితం చేయరాదు. అది ఇతర ప్రాంతాలలోని పరిణామాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. పరస్పరాధీనతా ప్రాతిపదికపై కూటమి రాజకీయ, ఆర్థిక బలాన్ని కూడా పెంపొందించాలి.

6 1955లో జెనీవాఅగ్రరాజ్యాధిపతులసమావేశంలో, జర్మన్ ప్రజల జాతీయ ప్రయోజనాలకు, యూరప్ భద్రతకు అనుగుణంగా స్వేచ్ఛాఎన్నికల ద్వారా జర్మనీ ఏకీకరణకు సహకరిస్తామని సోవియట్ నాయకులు వాగ్దానం చేశారు. వారా వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి.

7. అట్లాంటిక్ రక్షణవ్యవస్థకు ఇప్పుడు కొత్త ప్రాముఖ్యం ఏర్పడింది. సమిష్టిగా గట్టికృషి జరిపినపుడే ఆ ప్రాంత ప్రజల స్వాతంత్ర్యాన్ని రక్షించడం సాధ్యం.

స్వేచ్ఛాప్రజలందరి జీవన ప్రమాణాలను వృద్ధిపర్చడానికి అట్లాంటిక్ కూటమి తన ఉత్పత్తిశక్తులను పెంపొందించుకోవాలి. నౌకా విమాన రక్షణలోనూ, సైన్యాల పరికరాలలోనూ, సమన్వయం సాధించడం ద్వారా, కూటమి వనరులను మరింత బాగా ఉపయోగించుకోవచ్చు.

మధ్యప్రాచ్య దేశాల స్వాతంత్ర్యాన్ని, సర్వసహాధికారాన్ని అట్లాంటిక్ కూటమి ప్రభుత్వాలు బలపరుస్తాయి.

ఆధునిక ఆయుధాల అభివృద్ధిలో సమన్వయాన్ని, పరిశోధనను సాధించడానికి, కొత్తపద్ధతులు తీసుకోవాలి. ఇప్పటికే బాగా పురోగమించిన దేశాలు తమ సాంకేతిక విజ్ఞానాన్ని తమ మిత్రదేశాలతో పంచుకుంటాయి.

ఆఫ్రికాఖండంలో రాజకీయ ఆర్థిక సుస్థిరతను సాధించడంలో అట్లాంటిక్ కూటమి రాజ్యాలకు ఆసక్తివుంది.

(మిగతా 6వ పేజీలో)

వాషింగ్టన్‌కి ఐక్ పయనం

పారిస్, డిసెంబరు 19

అమెరికా అధ్యక్షులు ఐసెన్‌హోవర్ ఈవేళ పారిస్‌నుండి విమానంలో వాషింగ్టన్‌కు బయలుదేరారు.

పారిస్‌లో జరిగిన అట్లాంటిక్ కూటమి సమావేశం శాంతి అవకాశాలను కొంత పెంచి, యుద్ధావకాశాలను తగ్గించగల పనిని కొంత చేసిందని ఆయన వ్యాఖ్యానించారు.

పారిస్ ప్రకటనపై స్పాక్ వ్యాఖ్య

పారిస్, డిసెంబరు 19

అట్లాంటిక్ కూటమి ప్రధానకార్యదర్శి పాల్ హెన్రీ స్పాక్ కూటమి ప్రకటనను గురించి విలేఖరులకు వివరిస్తూ, ఇకపై కూటమి తన కార్యకలాపాలను తనకు సంబంధించిన ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయదనీ, ఇతర ప్రాంతాలకు కూడా తన సమాలోచనలను విస్తరిస్తుందనీ ఆ ప్రకటనలో ఉన్న అంశం చాల ముఖ్యమయినదన్నారు. ఇది కూటమి చరిత్రలో ఒక కొత్త పరిణామమన్నారు.

అట్లాంటిక్, బాగ్దాద్ కూటముల మధ్య లంకెను ఏర్పరిచే సమస్యను కూటమి శాశ్వత కౌన్సిల్‌కి తిరిగి అప్పగించారని ఆయన అన్నారు. దానితోపాటు అట్లాంటిక్ కూటమికీ, ఆగ్నేయాసియా కూటమికీ మధ్యనుండవలసిన సంబంధాలను నిర్ణయించే విషయాన్ని కూడా ఈ కౌన్సిలుకే అప్పగించారన్నారు.

నిన్నటి సమావేశంలో ఇండోనేషియా ఘటనలను గురించికూడా చర్చించారని కూటమి అధికారి ఒకరు పత్రికా విలేఖరులకు వివరించారు.

విశాఖ నౌకా కేంద్రంనుండి ఫ్రెంచి కంపెనీకి స్వస్తి?

వారిపని అసంతృప్తికరంగా ఉందని లోక్‌సభలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 19

విశాఖ నౌకా నిర్మాణ కేంద్రాన్ని ప్రస్తుతం నడిపిస్తున్న ఫ్రెంచి కంపెనీతో ప్రభుత్వం చేసుకొన్న ఒడంబడిక అయిదారు నెలల్లో ముగుస్తుందనీ, వీరి నిర్వహణ అసంతృప్తికరంగా ఉందిగనుక తొలగించే విషయం ప్రభుత్వ ఆలోచనలో ఉన్నదనీ రవాణాశాఖామంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి నేడు లోక్‌సభలో తెలియజేశారు.

నౌకా కేంద్రంలో పనినిగురించి వచ్చిన ప్రశ్నల పరంపరకు మంత్రి సమాధానం చెబుతూ వైవిధ్యంగా తెలియజేశారు. ఈ ఫ్రెంచి కంపెనీ పని ఏమీ సంతృప్తికరంగా లేదని ఆయన అన్నారు. నౌకా కేంద్రంలో వివిధశాఖలు ఏవిధంగా పనిచేస్తున్నాయో ప్రభుత్వం పరిశీలన జరిపించదలచుకుందనీ, ఇందుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించుతామని మంత్రి అన్నారు.

పాకిస్తాన్‌లో ఓటర్లజాబితా ముద్రణ

ఢాకా, డిసెంబరు 10

పాకిస్తాన్‌లో ఉమ్మడి నియోజకవర్గాల ఓటర్ల జాబితా ముద్రణను ఆపివేస్తూ ఇదివరకటి చుండ్రిగర్ మంత్రివర్గం చేసిన ఉత్తర్వును ఇప్పటి నూన్ మంత్రివర్గం రద్దుచేసింది. మత ప్రాతిపదికపై వేరు వేరు ఓటర్ల జాబితా ముద్రణను తక్షణం నిలిపివేయవలసిందిగా ఢాకాలోని ప్రభుత్వ ముద్రణాధికారికి తంతిద్వారా ఉత్తర్వులు పంపారు.

హరిజన, గిరిజనులకుగల సాంఘిక, ఆర్థిక సౌకర్యాలు

తగుచర్యలకై కేంద్రంచే రాష్ట్ర మంత్రుల సమావేశం ఏర్పాటు

న్యూఢిల్లీ, డిసెంబరు 19

హరిజనులకు, గిరిజనులకుగల సాంఘిక, ఆర్థిక అసౌకర్యాలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిచర్యలు తీసుకోవాలని నచ్చజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఆ శాఖకు సంబంధించిన రాష్ట్ర మంత్రులను, అధికారులను సమావేశ పరుస్తున్నది.

ఈ విషయాన్ని దేశ వ్యవహారాల సహాయమంత్రి శ్రీ బి. యన్. దాతార్ నేడు లోక్‌సభలో ప్రకటించారు.

ఈ సమావేశం సాధ్యమైనంత త్వరలో బహుశా వచ్చే నెలలో జరుగుతుందని ఆయన తెలిపారు.

నిమ్నజాతుల, కొండజాతుల కమిషనర్ నివేదికపై చర్చ జరిగిన సందర్భంలో శ్రీ దాతార్ ప్రసంగిస్తూ ఇంకా ఇలా చెప్పారు:

హరిజనులు, గిరిజనులు ఏ పరిస్థితులలో జీవనం గడుపుతున్నారో, ఏయే కష్టాలను, ఏయే అవాంతరాలను ఎదుర్కొనవలసి వస్తున్నదో స్వయంగా పరిశీలించడానికని పార్లమెంటు సభ్యులతోనూ, మరి కొంతమంది ఇతరులతో కూడిన ఒక బృందాన్ని ప్రభుత్వం వివిధప్రాంతాలకు పంపించాలని నిర్ణయించింది.

కాశీ విశ్వనాథుని దేవాలయంలోకి హరిజనులు ప్రవేశించారనీ, వారి ప్రవేశానికి అడ్డుతగిలినవారిపై కేసులు పెట్టబడ్డాయనీ, కొందరికి అప్పుడే శిక్షలు విధించబడినాయనీ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసిందని శ్రీ దాతార్ చెప్పారు.

కమీషనర్ నివేదికపై ఈవేళ కూడా చర్చ కొనసాగింది.

శ్రీ కన్హయ్యలాల్ వాల్మీకి, శ్రీ జయపాల్ సింగ్, శ్రీ కృష్ణ, శ్రీ నవల ప్రభాకర్, శ్రీ పి. కె. కొడియన్, శ్రీ పన్నాలాల్, శ్రీ యస్. ఆర్. ఆర్ముగం మొదలగువారు నేటి చర్చలో పాల్గొన్నారు.

చర్చ ఇంకా పూర్తికాలేదు. రేపు కూడా కొనసాగుతుంది.

మరాట్వాడా ప్రాంతానికి ప్రత్యేక యూనివర్శిటీ

బొంబాయి, డిసెంబరు 19

మరాట్వాడా ప్రాంతానికి ప్రత్యేక యూనివర్శిటీని స్థాపించాలని బొంబాయి ప్రభుత్వం నియమించిన పరిశీలనా సంఘంవారు సిఫారసు చేశారు. ఈ యూనివర్శిటీ కేంద్రాన్ని ఔరంగాబాద్‌లో నెలకొల్పాలని కూడా వారు సూచించారు.

కాపీరైటు హక్కులు

ప్రపంచమహాసభ తీర్మానానికి భారతప్రభుత్వ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 19

కాపీరైటు హక్కులను గురించి ప్రపంచ మహాసభ చేసిన తీర్మానాన్ని భారతప్రభుత్వం ఆమోదించి, ధృవపరచిందని కేంద్ర విద్యా, శాస్త్ర పరిశోధనా మంత్రిత్వశాఖ ప్రజల గమనిక నిమిత్తం నేడొక అధికార ప్రకటన చేసింది.

ఈ నిర్ణయం 1957 జనవరి 21వ తేదీన భారతదేశంలో అమలులోకి వస్తుంది.

ఈ విషయమై అంతకు పూర్వం బెర్న్‌లో జరిగిన సమావేశపు తీర్మానాలను 1887వ సంవత్సరం నుంచీ భారతదేశం పాటిస్తూ వచ్చింది. ఆ సమావేశంలో యూరోపు, ఆసియా దేశాలు, కొన్ని అమెరికన్ దేశాలు పాల్గొన్నాయి. అమెరికా అందులో పాల్గొనలేదు.

ఆ తరువాత ప్రపంచ వైజ్ఞానిక సమితి ఆధ్వర్యాన ఒక ప్రపంచమహాసభ ఏర్పాటు చేయబడింది. ఆ సమావేశంలో 50 దేశ ప్రభుత్వాల ప్రతినిధివర్గాలు పాల్గొన్నాయి. వాటిలో భారతప్రతినిధివర్గం కూడా ఒకటి.

బెర్న్ సమావేశంలో ప్రాతినిధ్యం పొందని దేశాలలో యీ క్రిందివి ఇప్పుడీ ప్రపంచమహాసభ తీర్మానాన్ని ధృవపరిచాయి.

అండోరా, అర్జెంటైన్ రిపబ్లిక్, కంబోడియా, చిలీ, కోస్టారికా, క్యూబా, ఈక్వెడార్, జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్, గ్వాటిమాలా, హైతీ, ఐర్లండు, లావోస్, లైబీరియా, మెక్సికో, నికరాగువా, ఎల్ సాల్వడార్, హోండూరాస్ రిపబ్లిక్, శాన్ మారినో రిపబ్లిక్, ఉరుగ్వే, అమెరికా.

ప్రపంచమహాసభ తీర్మాన నిబంధనలను అమలు జరిపేందుకు భారత కాపీరైటు చట్టంలో కొన్ని సవరణలు చేయవలసి ఉంది. 1957 సంవత్సరపు కాపీరైటుచట్టాన్ని ఇటీవల పార్లమెంటు ఆమోదించింది 1957 జనవరి 21వ తేదీనుంచీగా ఈ చట్టంలో 40, 41 విభాగాలక్రింద తగిన ఉత్తర్వును జారీచేసి అమలుపెట్టబడింది.

ఐ ఎ యస్ (స్పెషల్ రిక్రూట్‌మెంటు) తుది ఫలితాలు వచ్చే ఏడాది ఆరంభంలో ప్రకటించబడతాయని మంత్రి శ్రీ దాతార్ లోక్‌సభలో తెలిపారు.

మీకు కలిగే సమస్యలు అన్నియూ పరిష్కరించెదము........

రోడ్డు రవాణా ద్వారా మీ సామాన్లు

బొంబాయి
నుండి
విజయవాడ

దశకుల రోడ్డు రవాణాలో అనేకసంవత్సరాల అనుభవము. మీ సామాన్లను * సురక్షితముగా * త్వరగా * తక్కువ ధరకు మంచి శిక్షణ పొందిన డ్రైవరుద్వారా అందించగలము. * కాలము * డబ్బు * శ్రమను మీరు కాపాడవచ్చును. ఈ క్రింది స్థలములకు మేము సేవ చేయగలము.

రవాణా
లో
మంచి
పేరు
అందే

- బొంబాయి
- హైదరాబాద్
- సికింద్రాబాద్
- గుల్బర్గా
- బీదరు
- విజయవాడ
- విజయనగరం
- విశాఖపట్నం
- గుంటూరు
- రాజమండ్రి
- ఆంధ్ర ప్రదేశ్ అంతా

ఇంకా చాల ఇతర చోట్లకు కూడా

Bombay Hyderabad & Aurangabad Jalna

MOTOR SERVICE

హెడ్డాఫీసు :
113 భండారి వీధి, బొంబాయి-3
ఫోన్ : 22027
గ్రామ్స్ : CHIDIPIR

బ్రాంచి :
తారాపేట, విజయవాడ
ఫోన్ : Pp 455

హేవిళంబి నామ సంవత్సర
శా॥ దక్షిణాయన మార్గశిర బహుళ
అమావాస్య 14-42
మూల 25-17

విశాలాంధ్ర
శనివారం 21-12-57
30 మార్గశిరం 1879

ప్రమాదకరమైన సూచనలు

పంటల తరుణం వచ్చింది. చెమటోడ్చి పండించిన రైతాంగం ధాన్యాదులను అమ్ముకుని, తమకు కావలసిన సరకు కొనుక్కునే సమయమిదే. ముందుగా మామూలయ్యే బసంగులు, అక్కుళ్ళు, కొణామణి వగైరా రకాలవడ్లు మార్కెటుకు రావడం యిదివరకే ప్రారంభమయింది.

బియ్యం ధరలు విపరీతంగా పెరిగి, ఆహారపరిస్థితి క్లిష్టమైనపుడల్లా కేంద్ర ప్రభుత్వ ఆహారమంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జైన్ మామూళ్ళ తరుణంలో ఆహారధాన్యాలకు ధరలు నిర్ణయించి, ప్రభుత్వమేకొని గిడ్డంగులలో నిల్వచేయడంద్వారా మార్కెటు ఒడుదుడుకులనుండి ప్రజలను కాపాడుతామని వాగ్దానం చేస్తూవచ్చారు. నిల్వ వ్యాపారస్థుల అధిక లాభాపేక్షకు అన్నార్తులైన ప్రజలను వదలమని చెపుతూ వచ్చారు.

కాని పంటలతరుణం రానే వచ్చింది. కొత్త ధాన్యం మార్కెటుకు రావడంకూడా ప్రారంభమయింది అయినా ధాన్యాదుల ధరలనిర్ణయం ఇంతవరకు జరగనే లేదు. మాసాంతంలోపల ధరల నిర్ణయం చేస్తామనే కబుర్లు మాత్రం వినిపించుతున్నాయి. తమ ఖర్చుల నిమిత్తం కళ్ళాల్లోనే అమ్ముకోవలసిన బీద రైతులనుండి ధాన్యాన్ని నిల్వ వ్యాపారస్థులు కొనివేయడం అపుడే ప్రారంభమయింది.

ఇదిలావుండగా మద్రాసు ప్రభుత్వ ఆహార శాఖోద్యోగి చెప్పినట్లుగా 20వ తేదీ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలోవచ్చినవార్తలు ఆందోళనకరంగా వున్నాయి. అత్యవసర వస్తువుల చట్టంక్రింద కేంద్ర ప్రభుత్వం దక్షిణఆహారమండలిలోని నాలుగు రాష్ట్రాలకు ఆహార ధరలను నిర్ణయించుతుందట. అంతవరకు ఎవరికీ అభ్యంతరముండదు. కాని పై వార్త ప్రకారం ధాన్యం ధరలను నాలుగు రాష్ట్రాలలోనూ వేరుగా నిర్ణయించుతుందట. ఆంధ్రలో నిర్ణయించే ధరలకంటే మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాలలో నిర్ణయించే ధరలు ఎక్కువగా వుంటాయట. తద్వారా ఆంధ్రలో ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంటు ధరలకు అమ్మ యిష్టంలేని టోకు వ్యాపారస్థులు ధాన్యాన్ని దక్షిణ మండలంలోని కొరత రాష్ట్రాలకు స్వేచ్ఛగా రవాణా చేసేందుకు అవకాశం ఏర్పడుతుందట!

మద్రాసు ఆహార శాఖ ఉద్యోగి అభిప్రాయాలుగా ప్రకటించిన పై వార్త ఎంతవరకు నిజమో తెలియదు. ఆ ధోరణి మాత్రం ప్రమాదకరమైందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

దక్షిణ మండలిలో ఆంధ్రప్రదేశ్‌కు నిర్ణయించిన ధాన్యం ధరలు తక్కువగా వుండి, మద్రాసు వగైరా రాష్ట్రాలకు నిర్ణయించిన ధరలు హెచ్చుగా వుంటే వ్యాపారస్థులంతా సహజంగా ధాన్యాన్ని హెచ్చు ధరలున్న చోటికి రవాణా చేస్తారు. తత్ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లోనే కొరత ఏర్పడే ప్రమాదంవుంది.

అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లోని మెట్ట ప్రాంతాలన్నిటిలోనూ ఈ సంవత్సరం పంటలు దెబ్బ తిన్నాయి. అందుచేత మెట్టప్రాంతాల ప్రజలు మాగాణి ప్రాంతాల నుండి ధాన్యం కొనుగోలు చేసుకోవాలిసి వస్తుంది. అసలే కొనుగోలు శక్తి తక్కువగావున్న మెట్టప్రాంతాల ప్రజలు, ఆంధ్ర నుంచి హెచ్చు ధరలున్న రాష్ట్రాలకు ధాన్యం తరలిపోతుండగా చూస్తూ బాధపడవలసి వస్తుంది. ఇక వ్యాపారస్థులంటారా? ధరలున్న చోటికి రవాణా చేస్తారుగాని తక్కువ ధరలున్న ఆంధ్రలో ప్రొక్యూర్‌మెంటు ధరలకు ప్రభుత్వానికి ఎన్నటికీ ఇవ్వరు. అందుచేత ఒకే ఆహారమండలిలో వేర్వేరు రాష్ట్రాలలో వేర్వేరు ధరలు నిర్ణయించడం అత్యంత ప్రమాదకరమైనది పరిణమించుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఆహార ధాన్యాలలో మిగులు రాష్ట్రం అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వాధికారులు, పొరుగు రాష్ట్రాల అధికారులుకూడ పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారనిపించుతూంది. ఆంధ్రప్రదేశ్‌లోని 20 జిల్లాలలో కేవలం మాగాణిభూమి హెచ్చుగావున్న కొన్ని ప్రాంతాలు మాత్రమే ఆహార ధాన్యాలు అదనంగా పండించుతున్నాయనీ, రాష్ట్రంలో అధిక భాగంగావున్న మెట్ట ప్రాంతాలన్నిటిలో ఆహార కొరత వుందనీ గమనించినట్లు కన్పించదు. అందువలనే మద్రాసు మైసూరు, కేరళలలో ధరలు ఎక్కువగావుంటే ఆంధ్రలో టోకు వ్యాపారస్థులు స్వేచ్ఛగా రవాణాచేసి, పై రాష్ట్రాల్లోని ఆహారకొరత తొలగించుతారని వాదించుతున్నారు. టోకు వ్యాపారస్థుల లాభాపేక్షకు స్వేచ్ఛయిచ్చి, ఆహార సమస్య తీర్చాలనుకుంటున్న ఈ పెద్ద మనుష్యులకు, ఆంధ్ర ప్రదేశ్‌లోని బీదప్రజలకు ధాన్యం ధరలు అందుబాటులో లేకుండా పోతాయనిగానీ, వ్యాపారస్థులకు స్వేచ్ఛగా రవాణాచేసే అవకాశమిస్తే ఆంధ్రలోనే కొరత ఏర్పడుతుందనిగానీ వాస్తవవిషయాలు కన్పించకపోవడం ఆశ్చర్యకరం.

దక్షిణ ఆహార మండలిలోని వేర్వేరు రాష్ట్రాలకు వేర్వేరు ఆహార ధరలు నిర్ణయించడం సరికాదని కేంద్ర ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నాం. రైతులు అమ్ముకునే తరుణంలోనే ధరలు స్థిరీకరణచేసి, ప్రభుత్వమేకొని నిల్వచేసి, మార్కెటులో ధరలను అదుపులో వుంచాలని కోరుతున్నాం. మద్రాసు ఉద్యోగుల సలహా ప్రకారం వేర్వేరు ధరలు నిర్ణయించితే, ధాన్యమంతా ఇతర రాష్ట్రాలకు తరలిపోయి ఆంధ్ర ప్రదేశ్‌లోనే కొరత ఏర్పడే ప్రమాదముందని హెచ్చరించుతున్నాం. ఆహార ధాన్యాలకు గిట్టుబాటు ధరలను నిర్ణయించడంతో పాటు, రైతాంగంకొనేబట్టలు, ఎరువులు వగైరాలను కూడ చౌకగా అందజేసే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాం.

ఇక్ష్వాకుల నాటి రాజ ప్రాసాదం

నాగార్జున కొండవద్ద సాగుతున్న తవ్వకాల్లో బయటపడిన వైనం

నాగార్జునసాగర్, డిసెంబరు 20

నాగార్జున కొండవద్ద కృష్ణానదీ తీరంలో ఇక్ష్వాకుల నాటి పెద్ద రాజప్రాసాద మొకటి త్రవ్వకాల్లో బయటపడుతోంది. ఆ కాలంలో సంస్కృతంలో వ్రాసిన శిలాశాసన శకలం ఒకటి మొన్న బయటపడింది.

అశ్వమేధ ఘట్టం దాపులోనే పెద్ద ఏనుగు అస్థిపంజరం ఒకటి బయటపడింది.

కృష్ణానదీ ఒడ్డున ఇంతకుముందు బయటపడిన స్నానాలఘట్టపు మెట్ల ప్రక్కనే మరో మూడు స్నానఘట్టాలువున్న ప్రదేశంలో త్వరలోనే త్రవ్వకం ప్రారంభమవుతుంది.

నాగార్జునకొండ వద్ద బయటపడిన శిల్పకళా ఖండాలను చూడటానికి వందలాది యాత్రికులు వస్తున్నారు. కాని అక్కడ యాత్రికులకు అవసరమైన వసతిగృహం, హోటలు లేదు అందువల్ల కొంత ఇబ్బంది జరుగుతున్నది.

మొన్న ఆంధ్ర కార్మికమంత్రి శ్రీ సంజీవయ్యగారు నాగార్జునకొండవద్ద బయటపడుతున్న రాజప్రాసాద ప్రాంతమూ, విశ్వకళా పరిషత్తూ మొదలైనవి చూశారు. డాక్టర్ రా॥ ప్రొ॥ సుబ్రహ్మణ్యంగారి నాయకత్వాన ఇక్కడ త్వర త్వరగా జరుగుతున్న త్రవ్వకాల కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. నాగార్జునకొండ వద్ద బయటపడిన విశేషాలను గురించి వివరాలతో కూడిన ఒక గ్రంథాన్ని డాక్టర్ సుబ్రహ్మణ్యంగారు త్వరలోనే రచించబోతున్నారు.

నెల్లూరు జిల్లా చెరువు మరమ్మతులకు మరో రు. 6½ లక్షలు

హైద్రాబాదు, డిసెంబరు 19

వరదవలన కట్టలు తెగిపోయి పాడైన నెల్లూరుజిల్లాలోని చెరువుల మరమ్మతుకై ఇదివరలో రు 2 లక్షలను ప్రభుత్వంవారు మంజూరుచేశారు. ఇప్పుడు మరొక రు 6 లక్షల 40 వేలను మంజూరు చేశారు.

సిమెంటు ధర పెంచడంవల్లవచ్చిన ఆదా రు. 5 కోట్లు

దాన్ని రహదారులకు వినియోగిస్తాంట

న్యూఢిల్లీ, డిసెంబరు 19

సిమెంటును హెచ్చుధరలకు అమ్మడంవలన ప్రభుత్వ వ్యాపార సంస్థకు చేకూరిన లాభం రు. 5 కోట్లను జాతీయ రహదారుల అభివృద్ధికి వినియోగిస్తామని వాణిజ్య పరిశ్రమలమంత్రి శ్రీ మొరార్జీదేశాయి నేడు లోక్ సభలో తెలియజేశారు.

ప్రభుత్వ వ్యాపారసంస్థ కార్యకలాపాలపై రెండుగంటలు చర్చ జరిగిన సందర్భంలో [illegible] సభ్యులు సిమ్మెంటు యీ విధంగా హెచ్చు ధరలకు అమ్మడం 'అవినీతి' అని విమర్శించారు. ధరలు పెంచే బదులు ఎక్సైజు విధించితే బాగుండేదని ఒక సభ్యుడు చేసిన సూచనకు శ్రీ మొరార్జీ 'యిది మాటలలో [illegible]' అన్నారు.

సోడాను దిగుమతి చేయడంవల్ల దేశీయ ఉత్పత్తి దారులను [illegible] మరొక సభ్యుడు లేవదీసిన ఆక్షేపణకు శ్రీ మొరార్జీ సమాధానం చెబుతూ దేశీయ ఉత్పత్తిదార్ల వద్ద సరుకు నిల్వపడితే ప్రభుత్వమే తీసుకుంటుందని, అమ్ముతుందని తెలియజేశారు.

ప్రభుత్వ వ్యాపారసంస్థ, కొన్ని దేశాలతో కొన్ని సామాగ్రుల దిగుమతి విషయంలో సంప్రదించుతోందనీ, ఆ సామాగ్రులేవో ఇప్పుడు చెప్పడం మంచిదికాదనీ మంత్రి అన్నారు.

'పథేర్ పాంచాలీ'కి మరొక బహుమతి

అమెరికా చలనచిత్రోత్సవంలో

శాన్‌ఫ్రాన్సిస్కో, డిసెంబరు 19

శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో భారతీయ చిత్రం "పథేర్ పాంచాలీ"కి ప్రథమ బహుమానం లభించింది.

ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన సత్యజిత్ రాయ్‌కి ఉత్తమ దర్శకుడుగా బహుమానం వచ్చింది.

జర్మన్ నటుడు హీన్జ్‌రూమన్‌కి ఉత్తమనటుడుగానూ, డొలొరెస్‌డార్నీ అనే అమెరికన్ నటికి ఉత్తమ నటిగానూ బహుమానాలు వచ్చాయి.

అమెరికాలో జరిగిన ప్రథమ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ఇదే. 12 దేశాలనుంచి 15 చిత్రాలను చూపించారు. ఐదు ప్రముఖ పత్రికలలో పనిచేసే సినిమా విమర్శకులు నిర్ణయాలు చేశారు.

ప్రధాని నెహ్రూ అస్సాం పర్యటన

గౌహతి, డిసెంబరు 19

ప్రధాని నెహ్రూ డిసెంబరు 29వ తేదీన గౌహాతి వచ్చి అస్సాంలో మూడు రోజులపాటు పర్యటిస్తారు. 30వ తేదీన షిల్లాంగులో వుండి కొండ జాతులవారి నాయకులను కలుసుకొంటారు.

రామనాథపురం కొట్లాటల్లో హరిజనులకే హెచ్చునష్టం

లోక్‌సభకు సమర్పించిన నివేదికలో నిమ్నజాతుల కమిషనర్ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 18

రామనాథపురం కొట్లాటలలో జరిగిన గృహదహనాల్లో నిమ్నజాతులకు హెచ్చునష్టం వాటిల్లిందనీ, సుమారు 3 వేల వరకూ వారి ఇళ్ళు దగ్ధమైనాయనీ, నిమ్నజాతుల – కొండజాతుల కమిషనర్ తన నివేదికలో తెలియజేశారు.

హరిజనులకు, దేవార్లకు జరిగిన కొట్లాటలలో హరిజనులే నిస్సందేహంగా బలహీనులని, దేవార్లనుచూచి వారు భయభ్రాంతులైపోయారని, ఈ నివేదికలో పేర్కొన్నారు.

స్పీకర్ ఆదేశానుసారం, ఈ నివేదికను మంత్రి శ్రీ దాతార్ నేటి సాయంత్రం లోక్‌సభకు సమర్పించారు.

ఎన్ని ఇళ్ళు భస్మీపటలమైనవో సరిగా లెక్కవేయడానికి అధికారులకు సాధ్యం కాలేదని, అందుచేత ఈ విషయమై సమగ్రమైన విచారణ జరిపించి, ఆలస్యం లేకుండా సహాయం అందించడం అవసరమని నిమ్నజాతుల కమిషనర్ సూచించారు. కొంతమందికి ధాన్యం ఇవ్వడం, కుటుంబానికి ఆధారంగా వున్నవారు చనిపోయిన సందర్భాలలో అలవెన్సులు ఇవ్వడం సబబన్నారు.

పాడైపోయిన ఇళ్ళను మరమ్మతు చేసుకోడానికి మద్రాసు ప్రభుత్వం 30 రూపాయల వంతున ఇచ్చినందుకు ఈ నివేదికలో హర్షం వెల్లడించారు. ఈ మొత్తాన్ని 50 రూపాయలకు పెంచాలన్నారు.

"అల్లర్లుజరిగిన తాలూకాలూ బాగా వెనుకబడినవి. అక్కడ వ్యవసాయం, రోడ్లు, స్కూళ్ళు, కుటీరపరిశ్రమలు మున్నగునవి బాగా అభివృద్ధిపర్చాలి. కల్లోల ప్రాంతాలలో శాంతిని స్థాపించే కర్తవ్యాన్ని ఒక ఏడాదిపాటు, అనధికార రాజకీయేతర, కులతత్వరహిత సంస్థలకు అప్పగించాలి."

"బాగా వేళ్ళుపాదుకుని వున్న ఈ కులతత్వాన్ని వేగంగా నిర్మూలించడానికి ప్రయత్నించాలి. వెనుకబడిన జాతుల జాబితాను ఆక్షేపణగా పెంచుతుంటూ పోవడం వెనుకబడిన తత్వాన్ని తొలగించడానికి తోడ్పడదు. నిమ్నజాతి, కొండ జాతులలో మరీ అట్టడుగున వున్న జాతులు కొన్ని వున్నవి. వారి ఆర్థిక పరిస్థితిని, సాంఘిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మనదేశ జీవనాడులను క్రుంగదీస్తూ విచ్ఛిన్నకర పోకడలకు దారితీస్తున్న కులతత్వాన్ని నిర్మూలించడానికి ఇదేమార్గం." అని యీ నివేదికలో వివరించారు.

మాలవ్యా చిత్రపటం

పార్లమెంటు సెంట్రల్ హాలులో ఆవిష్కరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 19

కీర్తిశేషులైన పండిత మదన మోహన మాలవ్యా నిలువెత్తు చిత్రపటాన్ని నేడు పార్లమెంటు సెంట్రల్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంలో పండిత మాలవ్యా దేశానికి చేసిన సేవను ప్రశంసించుతూ ప్రధాని నెహ్రూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ, స్పీకర్ అనంతశయనం అయ్యంగారు ప్రసంగించారు.

ఈ చిత్ర పటాన్ని మదనమోహన మాలవ్యా స్మారక సమితి తరఫున శ్రీ పురుషోత్తమదాస్ టాండన్ పార్లమెంటుకు బహూకరించారు.

రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ కూడా ప్రసంగించారు.

పార్లమెంటు సెంట్రల్‌హాలులో ఆవిష్కరించబడిన దేశ నాయకుల చిత్రపటాల్లో ఇది ఆరోది.

పట్టభద్రుల నియోజకవర్గాలు

ఓటర్లుగా చేరగోరేవారికి కొన్ని సూచనలు

హైద్రాబాద్, డిసెంబరు 20

ఆంధ్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్లుగా చేరేవారికి ఈక్రింది అర్హతలు వుండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

1958 జనవరి 1వ తేదీకి పట్టభద్రుల నియోజకవర్గంలో సాధారణ నివాసియైవుండాలి ఆ తేదీ నాటికి కనీసం మూడేళ్ళ క్రితం భారతదేశంలోని ఏయూనివర్సిటీ డిగ్రీ నైనా లేక, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే తత్తుల్యమైన డిగ్రీలనైనా పొందినవారై వుండాలి. (యూనివర్సిటీ డిగ్రీకి తుల్యమైనవి ఏవో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గెజెట్‌లో ప్రకటిస్తుంది.)

1956 ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని 30వ నిబంధన ప్రకారం నిర్ణీతమైన 'ఫారం 8'లో ఓటరుగానమోదు చేసుకోవలసినదిగా కోరుతూ దరఖాస్తులు పెట్టుకోవాలి.

1958 జనవరి 1వ తేదీనాటికి దరఖాస్తుదారు సాధారణ పౌరుడుగా ఏ ప్రాంతంలో అయితే నివసిస్తుంటాడో ఆ ప్రాంతంలోని కలెక్టరు, డిప్యూటీ కలెక్టరు, తహశీల్‌దారు, డిప్యూటీ తహశీల్‌దారు కార్యాలయాలలో దాఖలు చేసుకోవచ్చు దరఖాస్తులు స్వీకరించే కడపటి తేదీ 1958 జనవరి 7వ తారీఖు. ఈ తేదీ తరువాత దరఖాస్తులు పెట్టుకొన్నవారి పేర్లను ఓటర్లలిస్టు నమోదు చేయటం సాధ్యంకాకపోవచ్చు.

దరఖాస్తులతోపాటు ఈ క్రింది యోగ్యతా పత్రాలలో ఏదో ఒకదానిని జతపర్చాలి: (1) డిగ్రీ సాధికారప్రతి, (2) ప్రభుత్వ రికార్డులో నమోదు అయిన కాపీ సాధికార ప్రతి, (3) యూనివర్సిటీ పట్టభద్రుడని రుజువు చేసే పత్రాలు, (4) కాలేజీ ప్రిన్సిపల్ గానీ ప్రొఫెసర్ గానీ ధ్రువపర్చిన పత్రాలు, (5) పరీక్షఫలితం ప్రకటించబడిన ప్రభుత్వ గజెట్ ధ్రువపత్రం.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు హిందీ పరీక్షలు

నిర్వహించే హిందీ ప్రచార సంస్థలకు ఉండవలసిన అర్హతలపై ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 19

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పరీక్షలను నిర్వహించుతున్న భారతదేశంలోని వివిధహిందీప్రచారక సంస్థలను ఈక్రింది షరతులకులోబడి గుర్తించడానికి భారత ప్రభుత్వం నిర్ణయించినదని కేంద్ర విద్యావైజ్ఞానిక పరిశోధనల మంత్రిత్వశాఖ నేడొక పత్రికా ప్రకటన చేసింది.

హిందీ ప్రచారక సంస్థలు పరీక్షల నిర్వహణకు నిర్దిష్టమైన నిబంధనలను రూపొందించాలి. ఆ నిబంధనలను పరీక్షల పరిగణనకు ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాలి. అంతర్రాష్ట్రీయ సంస్థలు ఈ నిబంధనలను నేరుగా భారత ప్రభుత్వానికి పంపవచ్చును.

ఆర్థికదృష్ట్యాకేమి, ప్రావీణ్యం దృష్ట్యాకేమి పరీక్షాకేంద్రాలువీలైనంత చిన్నవిగా వుండాలి. పదిమందికంటె తక్కువ విద్యార్థులకు పరీక్షా కేంద్రం వుండరాదు. పరీక్షల పరిగణన కోరే సంస్థ అఖిలభారత సంస్థ అయినా లేక ఇతరసంస్థఅయినా కనీసం 10 బోధనా కేంద్రాలను స్వయంగా కలిగివుండాలి. లేక 10 బోధనాసంస్థలు అనుబంధంగా వుండాలి. ఈ సంస్థలు నియమించే అధ్యాపకులు ఉన్నత అర్హతలు కలిగినవారై ఉండాలి. వివిధసంస్థలు నిర్ణయించే పాఠ్య గ్రంథాలు భారత ప్రభుత్వం ఆమోదించిన నమూనా సిలబసును అనుసరించి వుండాలి. ఈ సంస్థలు నిర్వహించే అన్ని పరీక్షలలోనూ మౌలిక పరీక్ష తప్పనిసరిగా వుండాలి. ప్రతి సంస్థకు పరీక్ష రుసుములవల్లవచ్చే ఆదాయంగాక 50,000 రూపాయల విలువగల ఆస్తులుండాలి.

ఈ పరిగణన శాశ్వత ప్రతిపత్తిలో ఇవ్వవచ్చును. ఐతే భారత ప్రభుత్వం మూడు సంవత్సరాలకొకసారి ఒక్కొక్క సంస్థయొక్క కృషిని సమీక్షించి, అది సంతృప్తికరంగా లేకపోతే పరిగణను ఉపసంహరిస్తుంది.

ఇందునిమిత్తం ఒక ప్రత్యేక దరఖాస్తు ఫారము నిర్ణయించబడింది. ఈ ఫారాలను కేంద్ర విద్యా, మంత్రిత్వశాఖ యొక్క విద్యాశాఖ హిందీ విభాగం నుంచి పొందవచ్చును. పూర్తి చేయబడిన దరఖాస్తు ఫారములు ఐదేసి ప్రతులు 1958 ఫిబ్రవరి 24 లోగా మంత్రిత్వ శాఖకు పంపాలి.

పారిశ్రామిక వివాదాలు

పారిశ్రామిక ట్రిబ్యునల్ తీర్పులు

హైదరాబాదు, డిసెంబరు 18

ఆదోనిలోని రాయలసీమ మిల్లు యజమానులకు, కార్మికులకుమధ్యఏర్పడిన వివాదంపై ట్రిబ్యునల్ తీర్పు ఈ క్రింది విధంగావుంది.

1. ప్రస్తుతం 26 రూపాయలు జీతం తెచ్చుకుంటున్న వారందరికీ 27-10-0, 26 రూపాయల పైన తెచ్చుకొంటున్న వారందరికీ, ఆ జీతాల పైన మరో 1-10-0 నవంబరు 1 నుంచి ఇవ్వాలి.
2. కొత్తగా 6400 కదుర్లు పనిచేయటం ప్రారంభించిన తదనంతరం ఉభయపక్షాల ప్రతినిధులు కదుర్ల భత్యం సమస్యను చర్చించి 15 మార్చి 1958 లోగా నిర్ణయానికి రావాలి.
3. 1955 సంవత్సరానికి ఒక నెల బోనస్ ఇవ్వాలి.
4. 5 రోజులు పండుగ శలవులు, 2 రోజులు జాతీయ దినాలు శలవులు జీతంతో ఇవ్వాలి.

లూమస్ కంపెనీ వివాదం

లూమస్‌కంపెనీ,(విశాఖపట్నం)లో పనిచేస్తున్న సూర్యనారాయణశర్మ అనే కార్మికుడు శలవుతీసుకోకుండా పనిలోకి రానందువల్ల అతనిని తొలగించాల్సి వచ్చిందన్న కంపెనీ వాదనను పరిశీలించి ఆ తొలగింపు ఒప్పైనదేనని ట్రిబ్యునల్ భావించింది. అయితే ఒక నెల నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు యిచ్చింది.

ఖమ్మం సత్యనారాయణ విత్యం, నూనెమిల్లు డ్రైవరును పని నుంచి తొలగించటం ఈ వివాదంలోని ముఖ్యాంశం. ఈ మిల్లు ప్రతి సంవత్సరం కొత్తగా ఇంకొకరికి అద్దెకిస్తుండటంవల్ల, కొత్తగా అద్దెకు తీసుకొన్నవారికి పాత కార్మికులను నియమించాల్సిన బాధ్యతలేదని, అదీకాక ఆకార్మికుని పని సంతృప్తికరంగా లేదనీ యజమానుల వాదన.

ఇదివరలో బొంబాయి లేబరు ట్రిబ్యునల్ మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పులను ట్రిబ్యునల్ ఉదహరించి యాజమాన్యం మారినంత మాత్రాన, బాధ్యతలేదనటం సరికాదని తీర్పుయిచ్చింది.

సంతృప్తికరంగా పని చేయలేదనే విషయాన్ని యజమానులు ధృవపర్చలేకపోయారని ట్రిబ్యునల్ భావించింది.

కాబట్టి ఆ కార్మికుని తిరిగి పనిలో ప్రవేశపెట్టుకొని, పనిలోనుంచి తొలగించిననాటినుంచి తిరిగి పెట్టుకొనే వరకూ అతనిజీతంలో నాలుగవవంతు అతనికి ఇవ్వాలని తీర్పు ఇచ్చింది.

ఉద్యోగాలు: నిరుద్యోగులు

ఆంధ్రలో పరిస్థితి

హైద్రాబాదు, డిసెంబరు 18

అక్టోబరు నెలలో ఎంప్లాయిమెంటులో 9582 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొంటే, ఆ సంఖ్య నవంబరు నెలలో 10620 కు పెరిగింది. అక్టోబరులో 1086 మందికి ఉద్యోగం చూపించ గలిగితే నవంబరులో 812 మందికి మాత్రమే ఉద్యోగాలు లభ్యమయ్యాయి. (వి. వి.)

నూటపదిహేడేళ్ల వృద్ధనారి

సోవియట్ దేశంలో

పోల్టవా, డిసెంబరు 19

యుక్రైన్‌లోని పోల్టవా గ్రామంలోని 117 సంవత్సరాల వయస్సుగల ఆబోవ్ పుజీత్‌కోవా అనే ఆమె ఇప్పటికీ పనిపాటులను చేయగల్గుతున్నది. ఆమె రోజల్లా కష్టపడి, రెండు మూడు గంటలు బయట షికారుచేస్తూ కాలం గడుపుతుంది.

ఈమె కేవలం శాఖాహారాన్ని మాత్రమే భుజిస్తుంది. ఈమె శిరోజాలు ఇప్పుడిప్పుడే తెల్లబడుతున్నవి.

దంతవైద్యుల రిజిష్టరు

రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన

హైదరాబాదు, డిసెంబరు 18

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా ఒక దంతవైద్యుల రిజిష్టరును తయారుచేయాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఈ రిజిష్టరులో తమపేరు నమోదు కావాలనుకొనే వారంతా ఆయా నిబంధనల క్రింద అర్హులయినపక్షంలో 15-1-1958 లోగా రిజిష్టరు చేయించుకోవాలని ప్రభుత్వం కోరింది. (వి. వి.)

కె. సి. కాలువ మూసివేత

హైద్రాబాదు, డిసెంబరు 18

ఏప్రిల్ 30, 1958 నుంచి జూన్ 30వ తేదీవరకూ కె. సి. కాలువ సుంకేసులలోని హెడ్ స్లూయిస్ నుంచి కొసవరకూ రిపేరు కొరకు మూసివేయబడుతుందని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది.

ఈ కాలంలోనీటిఅందుబాటులేకపోవటంవల్ల పంటలు పాడైతే ప్రభుత్వం బాధ్యత వహించబోదని హెచ్చరిక చేసింది. (వి. వి.)

టర్కీ దురుద్దేశాలు

అట్లాంటిక్ కూటమి దేశాలకు సిరియా హెచ్చరిక

డమాస్కస్, డిసెంబరు 19

సిరియాపట్ల టర్కీ అవలంబిస్తున్న వైఖరి దురాక్రమణ ఉద్దేశాలతో కూడి ఉన్నదని తెలుపుతూ సిరియా ప్రభుత్వం నేడు అట్లాంటిక్ కూటమి దేశాలకు వాటి దౌత్య ప్రతినిధులద్వారా జాబులు అందజేసింది. ఈ ఉద్దేశాలతో టర్కీ తలపెట్టే చర్యలలో తమను కూడా ఇరికించగలదని జాబులో ఈ హెచ్చరించింది.

అత్యంత ప్రాచీనమైన భారత గణాంక శాస్త్రం

ప్రొఫెసర్ హాల్డేన్ వివరణ

కలకత్తా, డిసెంబరు 19

రెండువేల సంవత్సరాలకు పూర్వమే భారతదేశం గణాంక శాస్త్రంలో ప్రసిద్ధి పొందినదని సుప్రసిద్ధ శాస్త్రవేత్త జె. బి. ఎస్. హాల్డేన్ నేడిక్కడ భారతీయ గణాంక శాస్త్రసంస్థ వార్షిక సమావేశంలో ప్రసంగిస్తూ చెప్పారు.

అశోక చక్రవర్తుని కాలంలోనే "ధమ్మమహామాత్తులు" (ప్రభుత్వోద్యోగులు) వివిధ రంగాలలో దశలవారీగా జరిపే పరిశీలనలలోవిప్లవకరమైన పర్యవసానాలను ఆధారం చేసుకొని, ప్రభుత్వ విధానాలను రూపొందించేవారని ఆయన చెప్పారు.

ఇండొనేషియాలోని డచ్చిభవనాలపై కమ్యూనిస్టు జెండాలు

విదేశ వార్తాసంస్థల ప్రచారాన్ని ఖండిస్తూ ఇండొనేషియావారి ప్రకటన

కలకత్తా, డిసెంబరు 20

ఇండొనేషియా కార్మికులు తాము స్వాధీనం చేసుకొన్న డచ్చి వ్యాపార సంస్థల భవనాలపై కమ్యూనిస్టు జెండాలను ఎగురవేశారని ఇటీవల విదేశవార్తాసంస్థలు ప్రచారంచేసిన వార్తలను ఖండిస్తూ నేడిక్కడ ఇండొనేషియా దౌత్య కార్యాలయంవారు ప్రకటన చేశారు.

ఇండొనేషియాలో ఇటీవల దేశవ్యాపితంగా డచ్చి సంస్థలను ఆక్రమించుకున్న సందర్భంలో జరిగిన ఘటనలను గురించి కలకత్తాలోని ఇండొనేషియా దౌత్య కార్యాలయం వారు నేడుజేసిన పత్రికా ప్రకటనలో ఈ క్రిందివిధంగా వుంది:

ఇండొనేషియాలోని డచ్చి వ్యాపారసంస్థల భవనాలపై కమ్యూనిస్టు జెండాలు ఎగురవేయబడినాయని డచ్చివారు ప్రచారం సాగిస్తున్నారు. ఆ విధంగా వారు ఇండొనేషియాలో ఇప్పుడు జరుగుతున్నదంతా కమ్యూనిస్టులవల్లనేనని అందరికీ అభిప్రాయాన్ని కలిగించాలని చూస్తున్నారు. ఈ విధంగా వారు డచ్చి - ఇండొనేషియా తగాదాను ప్రచ్ఛన్న యుద్ధంలో ఒక భాగంగా చేయడానికి యత్నిస్తున్నారు.

అసలు నిజం జరిగినదేమంటే ఆక్రమించిన డచ్చి భవనాలపై ఎగురవేసింది, కార్మిక జెండాలు మాత్రమే కాని, సుత్తి కొడవలి గుర్తుగల కమ్యూనిస్టు పతాకాలుకావు.

ఇండొనేషియాలో విదేశీ బ్యాంకుల పెత్తనాన్ని నిర్మూలించే బిల్లు

జకార్తా, డిసెంబరు 19

ఇండొనేషియా జాతీయ ఆర్థిక వ్యవస్థపై విదేశీ బ్యాంకుల పెత్తనాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం ఇప్పుడు ప్రయత్నిస్తున్నదని ఇండొనేషియా ఆర్థికశాఖమంత్రి డాక్టర్ సుతిక్నో స్లామెట్ తెలిపారు. ప్రభుత్వబ్యాంకుల ప్రైవేటు బ్యాంకుల వ్యవహారాలను గురించి ప్రభుత్వం ఒక బిల్లును తయారుచేస్తున్నదన్నారు.

వేలకొలది డచ్చిపౌరులు ఇండొనేషియాను వదిలి పోడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పన్నెండు వందలమంది డచ్చితోటల పనివారూ, ఫ్యాక్టరీ పనివారూ ఈ నెల సురబాయానుండి సింగపూర్ బయలుదేరి వెళ్ళారు.

డచ్చివారు ఖాళీచేసిపోతున్న స్థానంలోకి రావలసిందిగా మరే విదేశాన్నీ కోరే ఉద్దేశం ఇండొనేషియా ప్రభుత్వానికిలేదని ప్రధాని జువాండా కార్తవీర్య నేడొక పత్రికా గోష్టిలో స్పష్టంచేశారు.

స్థానిక హిందీ దినపత్రిక "నవరాష్ట్ర"లో పనిచేస్తున్న పాత్రికేయులకూ, ఆ పత్రికాధిపతులకూ మధ్యగల తగాదాను పరిష్కరించడానికి ప్రభుత్వం పాట్నా లేబరు కోర్టుకు పంపించింది. ఆ పత్రికలో పనిచేస్తున్న నలుగురు పాత్రికేయులనూ, ఏడుగురు ప్రెస్ కార్మికులను పనినుండి తీసివేసినందున ఈ తగాదా ఏర్పడింది.

తిరువూరు తాలూకా పార్టీ పునర్నిర్మాణం

474 మంది కమ్యూనిస్టుపార్టీలో సభ్యులుగా చేరుతూ ప్రమాణ స్వీకారం

తిరువూరు, డిసెంబరు 18

కృష్ణాజిల్లా తిరువూరుతాలూకాలో పార్టీ పునర్నిర్మాణ కార్యక్రమం అక్టోబరు 13, 14 తేదీలలో జరిగిన విస్తృత సమావేశం తర్వాత ప్రారంభమైంది. యిప్పటివరకు 24 గ్రామాలలో 474 మంది కమ్యూనిస్టుపార్టీలో సభ్యులుగా చేరుతూ ప్రమాణ పత్రాలపై సంతకాలు చేశారు.

ఊటుకూరు: 74 మంది గ్రామ సెంటరులో అరుణపతాకం ప్రతిష్ఠించి ప్రమాణం స్వీకరించారు. అనంతరం జరిగిన సభలో తాలూకా కమిటీ సభ్యులు ఆర్. వేణుగోపాలరావు సభ్యులయొక్క విధులను గురించి, హక్కులను గురించి ఉపన్యసించారు. తరువాత 11 మందితో కూడిన గ్రామ కమిటీకి శ్రీ ఆర్. కృష్ణయ్యను కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

కోనిజర్ల: 18 మంది ప్రమాణ పత్రాలపై సంతకాలుచేసి పార్టీ సభ్యులుగా చేరారు. 5 గురితో కూడిన కమిటీకి శ్రీ యస్. శేషగిరిరావును కార్యదర్శిగా ఎన్నుకొన్నారు.

పెనుగొలను: శ్రీ కోనేటి అప్పారావుగారిని కార్యదర్శిగా ఎన్నుకొని 10 మంది పార్టీలోచేరుతూ ప్రమాణం స్వీకరించారు.

గొల్లమండల: 21 మంది ప్రమాణ పత్రాలపై సంతకాలు చేసి పార్టీలో చేరారు.

పెద్దవరం: 19 మంది పార్టీ సభ్యత్వం స్వీకరించి ప్రమాణం చేశారు. అనంతరం ముగ్గురితో కూడిన కమిటీకి యస్. శ్రీనివాసరావుగారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

కూనవరాజుపర్వ: 32 మంది ప్రమాణపత్రాలపై సంతకాలు చేసి పార్టీ సభ్యత్వంస్వీకరించారు. మోరంపూడి నాగేశ్వరరావుగారిని కార్యదర్శిగా 7 గురితో కమిటీని ఎన్నుకున్నారు.

లక్ష్మీపురం: కలగరశివారు లక్ష్మీపురములో 20 మంది పార్టీలోచేరుతూ ప్రమాణ పత్రాలపై సంతకాలుచేశారు.

చంద్రుపట్ల: 9 మంది ప్రమాణం స్వీకరించి పార్టీలో చేరారు.

తువ్వచిలక: 11 మంది ప్రమాణ పత్రాలపై సంతకాలుచేసి శ్రీ టి. సామియేలును కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

చనుబండ: 15 మంది పార్టీ ప్రమాణపత్రాలపై సంతకాలు చేసి సభ్యత్వం స్వీకరించారు.

వేమిరెడ్డిపల్లి: 14 మంది పార్టీలో చేరుతూ ప్రమాణ పత్రాలపై సంతకాలు చేశారు.

మోతేరావుపేట: ప్రమాణ స్వీకారోత్సవం పిమ్మట 5 గురు సభ్యత్వం స్వీకరించి కట్టా కోటయ్యగారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

కొర్లమండ: 7 గురు సభ్యత్వం స్వీకరించి ప్రమాణ పత్రాలపై సంతకాలు చేశారు.

నరసింహారావుపాలెం: ప్రమాణ స్వీకారానంతరం 15 మంది సభ్యత్వం స్వీకరించి 5 గురు గల కమిటీకి దేశిరెడ్డి పెదరాఘవరెడ్డిగారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

కంభంపాడు: 10 మంది పార్టీలో చేరుతూ ప్రమాణ పత్రాలపై సంతకాలు చేశారు.

ఆట్లప్రగడ: 8 మంది ప్రమాణ పత్రాలపై సంతకాలు చేసి పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

గంపలగూడెం: యిప్పటి వరకు 10 మంది పార్టీ ప్రమాణ పత్రాలపై సంతకాలుచేసి సభ్యత్వంస్వీకరించారు.

మద్దులపర్వ: 22 మంది ప్రమాణ స్వీకారనంతరం పార్టీలో చేరుతూ 5 గురితో ఏర్పడిన కమిటీ కార్యదర్శిగా కావలి గోపాలరావుగారిని ఎన్నుకున్నారు.

విస్సన్నపేట: 22 మంది పార్టీ దరఖాస్తులపై సంతకాలు చేశారు, సభ్యత్వం స్వీకరించారు.

తాతకుంట్ల: 60 మంది పార్టీలో చేరుతూ ప్రమాణపత్రాలపై సంతకాలు చేశారు.

చిట్టేల: 8 మంది పార్టీ ప్రమాణ స్వీకారనంతరం శ్రీ కొల్లి మధుసూదనరావును కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

రాజుగూడెం: 12 మంది పార్టీ సభ్యత్వం స్వీకరించుతూ ప్రమాణ స్వీకారోత్సవం పిమ్మట కొమ్మినేని తిరుపతయ్యగారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

చిత్తపూరు: 10 మంది పార్టీలో చేరి ప్రమాణానంతరం కార్యదర్శిగా శ్రీ కొండా నీలాంబరంగారిని ఎన్నుకున్నారు.

పై కార్యక్రమంలో తాలూకా కమిటీ సభ్యులు శ్రీ ఆర్. వేణుగోపాలరావు, పార్టీ కార్యదర్శి సుంకర వీరభద్రరావు, కేమిశెట్టి కోటయ్య, ఎ. జగన్నాథాచారి, కొండా ఆశీర్వాదం, సయ్యద్ సాలార్ సాహెబ్, ఎ. బ్రహ్మయ్య, యం. గోపయ్య, జిల్లా కమిటీ సభ్యులు పేట రామారావు, తాలూకా కమిటీ తరపున ఎ. బోధాయన హాజరైనారు.

బజారు ధరలు

విజయవాడ, డిసెంబరు 20
(మధ్యాహ్నం 1 గం. వరకు)

బంగారం ధరలు

కేలిమిపాట్లా			109 0 0
[illegible]			108 0 0
సవరను			72 0 0
వెండి 100 తులములు			184 0 0
1 తులము			1 14 6

అపరాల ధరలు

మినుములు 240 సే॥		49/-	55 0 0
కందులు		88/-	40 0 0
పల్లెపెసలు (మాగాణి)			45 0 0
పచ్చపెసలు 280			51 0 0
,, (మెట్టవి)		88/-	41 8 0
శెనగలు (దేశవాళీ)			40 0 0
శెనగలు (పంజాబు)			34 0 0
ధనియాలు 280కుంచాలు		18/-	15 0 0
ఉలవలు			38 0 0
[illegible]			49 0 0
పంచదార (ఉయ్యూరు)			100 7 0
కొబ్బరినూనె డబ్బా			40 4 0
వెల్లుల్లి	మణుగు		6 10 0
బెల్లం	,,	8-12-0	4 6 0
మిర్చి	,,	11- 0-0	20 0 0
నీరుల్లి	,,	2- 4-0	2 12 0
చింతపండు	,,	8-12-0	4 10 0
నువ్వులనూనె	,,		88 8 0
వేరుశనగపప్పు 177 సే॥			
జగ్గయ్యపేట			55 10 0
కోదాడు			56 0 0
,, నూనె	మణుగు		15 8 0
,, కేక్ 160 సే॥			15 12 0
కొబ్బరికాయలు 1000			
పాత			185 0 0
కొత్త		160	165 0 0
సంచులు 100			106 4 0
డిటో ఫార్వర్డు (జనవరి)			98 4 0

వైరా ఆంధ్ర నికేతన ఉన్నత పాఠశాల

వైరా, డిసెంబరు 16

మధిరతాలూకా వైరాలో ఆంధ్ర నికేతన ఉన్నత పాఠశాల కమిటీచే నిర్మింపబడిన పాఠశాల గదులను జిల్లా విద్యాశాఖాధికారి ప్రారంభోత్సవం చేశారు.

ఈ ఉత్సవానికి, కమిటీ సభ్యులు, హైస్కూలు, మిడిల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పురప్రముఖులు, చుట్టుప్రక్కల గ్రామాల ఆహ్వానితులు పెక్కుమంది హాజరయ్యారు. సాయంత్రం అల్పాహారవిందు జరిగింది. అనంతరం స్కూలు ఆవరణలో జరిగిన బహిరంగసభకు వైరాబ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు అధ్యక్షత వహించారు. సభలో స్కూలు కమిటీ అధ్యక్షులు శ్రీ కొండబోలు వెంకయ్య కమిటీ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగార్లు ప్రాథమిక పాఠశాలనుండి హైస్కూలువరకు వచ్చుటలో జరిగినకృషిని వివరిస్తూ యింత కృషిలో తోడ్పడిన వారందరికి అభినందనలు తెలిపారు. వైరా పంచాయితీ అధ్యక్షుడు శ్రీ సాతులూరి సంపత్ కుమార్, శ్రీయుతులు [illegible]పూడి రంగారావు, అడపా గోపాలం, కృష్ణమూర్తిగార్లు స్కూలుకమిటీ కృషికి చేయూత నివ్వవలసిన అవసరాన్ని గురించి చెప్పారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. వి. వెంకటరత్నంగారు స్కూలు అభివృద్ధిని గురించి ప్రసంగించారు. స్కూలు కమిటీ కార్యదర్శి శ్రీ చింతనిప్పు వరసయ్యగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

లేఖలు

క్షయ నివారణ నిధికి నిర్బంధ సేకరణ

మహాశయా!

చీరాలలోని ప్రభుత్వ వైద్యశాలలో మందుకొరకై పోవు ప్రతివారిని రెండు అణాలు రుసుం చెల్లించవలసిందిగా నిర్బంధము చేయుచున్నారు. ఈ రుసుము అఖిలభారత క్షయ నివారణ నిధికి పంపుచున్నారట. క్షయ నివారణ నిధి క్రింద చందాలు యిచ్చుటకు ఎవరికి అభ్యంతరముండదు. కాని ఈ చందాలు ఐచ్ఛికముగా ఉండాలి. నిర్బంధ ధనసేకరణ చేయుచున్నప్పుడు యిక ప్రజలకు ఉచిత వైద్యాలయాలవలనకలిగే ప్రయోజనమేమిటో బోధపడుటలేదు. కనుక ప్రభుత్వము వారు ఉచితముగా వైద్య సహాయము లభించునటుల తోడ్పడకోరెదను.

— పాలెపు భిక్షాలు, చీరాల.

కమతాల భోగట్టా

మహాశయా!

20 ఎకరాలకుపైగ వున్న భూయజమానులంతా తహశీల్ దార్లకు తెలుపవలెనని ప్రకటించిన ప్రకారం తెలుపుకొనుటలో రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. దీనికి సంబంధించిన ఫారాలు బ్లాకు మార్కెటులో 0-2-0 మొదలుకొని 0-4-0 వరకు కొనవస్తున్నది. ఇక ఫారాలు తాలూకా ఆఫీసులో సమర్పించుకొంటే ఆ ఫారము ముట్టినట్లు రసీదు కోసం ఖర్చులు పెట్టుకొని మూడు నాలుగు దఫాలు తిరగవలసివస్తూంది.

అంతేగాకుండా సమర్పించిన ఫారాలకు రసీదు లివ్వనందున తమ ఫారాలు యేమవుతవో అని అవి లేకుండా పోతే గవర్నమెంటు ఆర్డరు ప్రకారం రు 500 లు జుల్మానాపడుతుందని భయపడుతున్నారు.

కాబట్టి ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేయవలెనని కోరుతున్నాను.

— వి. ఆదినారాయణరెడ్డి.

వరుచూరు లోకల్ లైబ్రరీ

మహాశయా!

గుంటూరుజిల్లా పరుచూరు గ్రామములో సుమారు 4 సంవత్సరముల క్రితం ఒక లోకల్ లైబ్రరీ స్థాపింపబడినది. అది రానురాను వృద్ధియగుటకు బదులు క్షీణించిపోతున్నది. 4 మాసములనుంచి పత్రిక, మాసపత్రికలుకూడా వచ్చుటలేదు. ప్రక్క గ్రామాదులనుంచి వచ్చు పాఠకులకు మంచినీటి సౌకర్యంలేదు. కావున గుంటూరుజిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీవారు తగు శ్రద్ధవహించి పత్రిక, మాసపత్రికలు సకాలంలో వచ్చునట్లుచేసి, మంచినీటి సౌకర్యం చేయగలరని ఆశిస్తున్నాను.

— కె. మాణిక్యారావు, పరుచూరు.

వ్యవసాయశాఖ నిర్లక్ష్యం

మహాశయా!

ఆంధ్ర ప్రభుత్వము రైతులకు అమెరికా మొదలగు ఎనుపులు అప్పు యిచ్చునపుడు నిర్బంధముగా పాడి పంటలు మాసపత్రికకు సంవత్సరచందా 2-12-0 వసూలు చేయుచున్నారు. కాని ఏ మాసమునకు ఆ మాసపత్రిక యివ్వటలేదు. కారణం తెలియదు. యీ సంవత్సరము ఫిబ్రవరి పత్రిక యీ నెల 15 వ తేదీన యిచ్చినారు. పత్రిక ఖరీదు మూడుఅణాలు. మిగతాడబ్బు ఏమి అయినదీ తెలియదు. దానిని గురించి ఆలోచించే నాధుడు లేడు. వెంటనే ఏ మాస పత్రిక ఆ మాసమునకు రైతుకు అందునట్లు ప్రభుత్వము చర్య తీసుకొనగలదని ఆశించుచున్నాను.

స్వర్ణ నాయుడమ్మచౌదరి బి. ఏ.
కొండపాటూరు.

కంచిభట్ల వెంకటేశ్వర్లు గారి మరణం

తెనాలి, డిసెంబరు 16

తెనాలిలో చాలకాలంగా 'ది మెయిల్' ఇంగ్లీషు దినపత్రిక విలేఖరుగా పనిచేస్తూన్న కంచిభట్ల వెంకటేశ్వర్లుగారు ఈనెల 14 వ తేదీన మరణించారు. వీరు నాల్గు సంవత్సరాలుగా దీర్ఘవ్యాధులతో బాధపడుతున్నారు. (వి. వి.)

మంగళవారం రాత్రి 'లోహారు' భారత పరిహద్దు వద్ద సాయుధులైన ఇద్దరు పాకిస్తాన్ దొంగ బంగారం వ్యాపారస్థులను భారత పోలీసులు కాల్చివేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అభ్యుదయోత్సవాలు

వాల్తేరు, డిసెంబరు 18

ఏడవరోజున జరిగిన సభకు శ్రీ దుర్గాప్రసాద్‌గారధ్యక్షతవహించారు. సభలో శ్రీ నేలటూరివెంకటరమణయ్య, శ్రీ ఎమ్. ఎస్. ప్రకాశరావు, శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారలు చరిత్ర - సంస్కృతిపై ప్రసంగించారు.

తొలుత శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు ప్రసంగిస్తూ చరిత్ర అంటే ఒకజాతి లేక సంస్థ యొక్క చరిత్ర కాదు. అన్నిజాతుల యొక్క, సంస్థలయొక్క సమస్య. విషయాలకుగల పుట్టు పూర్వోత్తరాలను తెలియజేసేదే చరిత్ర. ఇది అనేక శాస్త్రాలమీద ఆధారపడి ఉంటుంది. ప్రతీ దానికీ చరిత్రఅనేది ఒకటుంటుంది. జాతి ప్రజలు, పాలకులు వారి స్థితిగతులు మొదలగునవన్నీ వివరింపగల్గేదిచరిత్ర.

దండయాత్రల మూలంగా నాగరికత నశించేమాట వాస్తవమేగాని ఎక్కువ అభివృద్ధి చెందటానికి అవకాశాలున్నాయి. ఉదాహరణకు గ్రీకులదండయాత్ర. అది మనశిల్పంలో గొప్పపరిణామాన్ని తెచ్చింది.

ఈ సందర్భంలో మనం ఒకటి గుర్తుంచుకోవాలి, అన్ని దేశాలకూ చరిత్రఅనేది ఉంటుందికానీ మన భారతదేశానికి సమగ్రమైన చరిత్ర లేదు. అసలు చరిత్రకు మన ఆధారాలు కొంతవరకు పురాణాలు, ఇతిహాసాలు. మన పూర్వులకు యిహలోకంకన్నా పరలోకంపైప్రేమఎక్కువ కనుక అవిఅన్నీ పారమార్థిక చింతనలలో మునిగి చరిత్రస్థానం తగ్గింది. వైజ్ఞానికజాగ్రత్తగాపరిశీలిస్తే నాణేలూ, శాసనాలూ, గ్రంథాల పీఠికలూ మొదలైన వాటితోనూ, శాస్త్రీయంగా ఋజువు చేయబడిన అంశాలతోనూ మనం మన దేశానికి ఒక సరికొత్త చరిత్రను తయారుచేయాలి. ఈ తయారింపుకు ప్రభుత్వం అనేక సంస్థలను నెలకొల్పింది. కానీ వారివల్ల ప్రయోజనం ఇంతవరకూ కన్పడలేదు. విద్యార్థులైన మీరు దేశానికి సమగ్రమైన చరిత్రను రచించటంలో నిపుణులవుతారని ఆశిస్తున్నాను అని తమ ప్రసంగం ముగించారు.

పిమ్మట శ్రీ ఎమ్. ఎస్. ప్రకాశరావుగారు ఉపన్యసిస్తూ 'సంస్కృతి' అంటే మనం ఎవరమో అనేది సంస్కృతి, మనం ఏం ఉపయోగిస్తూ ఉంటాం అనేది నాగరికత, అన్న పూర్వుల వాక్యాన్ని గుర్తుచేస్తూ ప్రపంచంలో ప్రతిదానికీమితీ, హద్దూ అనేవి ఉంటాయనీ, అవిదాటినవాడు సంస్కారం లేనివాడని మనం అంటామనీ సోదాహరణంగా వివరించారు. వారు ఇంకా ఇలా అన్నారు. సంస్కృతిలో ఒక భాగం కళలు. వాటినన్నిటిని గురించి సమగ్రంగా చెప్పేవాళ్ళెవరూ లేరు. నేను ఆకళల్లో ఒకటయిన చిత్రలేఖనం గురించి మీకు వివరిస్తాను. ఇది నాగరికతని అందులో పట్టణవాసుల లక్షణాలలో ముఖ్యమైంది. ఈ విషయం పూర్వం వాత్స్యాయనుడే స్పష్టీకరించాడు. ఏ విధమైన సహాయం ఉపన్యాసాలవలన రాదు. ఆచరణలో సాధించాలి. నేడు విద్యార్థులు చిత్రలేఖనం అంటే కర్ణాటక సంగీతంగా భావిస్తారు. అయితే అందరు విద్యార్థులూ ఏదో ఒక రకమైన చిత్రాలు తమ గదులలో ఉంచుతారు. అవి ఎలాంటివో అందరికీ తెలుసు. కానిమీరు ప్రపంచ విఖ్యాత చిత్రాలనైనా కొద్దిగాకొని మీ దగ్గర ఉంచండి. చిత్రకారుల విలువను చెప్పాలంటే పూర్వం బెల్జియంపునర్నిర్మాణం చేసింది వారి చిత్రాలను అమ్మితే వచ్చిన ధనం వల్లనే అనేది గుర్తుంచుకోండి! ప్రతి విద్యాలయమూ దీనికి కొన్ని గంటలు ప్రత్యేకించి విద్యార్థులకు బోధించాలి. ఈవిశ్వవిద్యాలయంవారు ఈచిత్రలేఖనాన్ని సక్రమంగా ఆదరించకపోయినా దొడ్డిదోవను అంటే నాటకాలద్వారాను, సాంచీస్థూప చ్ఛాయలతో విలసిల్లే ఈ రంగస్థలం నిర్మించినందువల్లను అభివందనీయులు. అజంతా చిత్రాలు పరికిస్తే అందులో 1, 2, 9, 10, 12, 16, 17, 21 గుహాలలోవి నిజంగా 'న భూతో న భవిష్యతి'. చిత్రకారుడు అందులో 5,6 రంగులనుమాత్రమే వాడాడు. ఇప్పుడు దేశంలో 32 రంగులున్నవి. ఉత్తమ చిత్రాల లక్షణం వానికి వ్యాఖ్యానం అనవసరం కావటమే. అటువంటి చిత్రాలనన్నీ విద్యార్థులయిన మీరు తెప్పించి చిత్రకళనూ, తద్వారా సంస్కృతిని వృద్ధిచేస్తారనీ ఆశిస్తున్నాను. చరిత్ర- సంస్కృతులు ఒకదానిపై వేరొకటి ఆధారపడి ఉన్నాయి అని ముగించారు.

చివరకు శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు గారు ఉపన్యసిస్తూ సంస్కృతి అంటే పూర్వం చాలామందికి అర్థమయ్యేది కాదు. కందుకూరి వారి సంస్కరణ, మాంటేగు - ఛెమ్స్‌ఫర్డు సంస్కరణలనుకొనేవారు. నేడు ప్రతి సభలోనూ దీనికి స్థానం వచ్చింది. దీని అర్థం ఇప్పుడుఅందరికీ తెలుస్తున్నది. సంస్కృతి అంటే సంస్కారం కలవాడు. శరీరానికి, జీవికి, ఆత్మకు వీటన్నిటికీ సంబంధించిన సంస్కారాలు గలవాడే సంస్కారి. ఆంతరంగికమైన సంస్కారం ఉంటేనేగాని బాహ్య సంస్కారంరాదు. ఇన్నింటితో కూడింది సంస్కృతి. శరీరం మనకు వెల్లివంటిది. గోపురంవంటి పవిత్రమైంది. దానికి సంస్కారం చేయాలి. అట్లా చేయగలిగినవన్నీకళలే!' అని చెపుతూ పూర్వకాలం ప్రజల సంస్కారం, ఇప్పటి వారి సంస్కారాలలోగల వ్యత్యాసాలను హాస్యంగా విప్పి చెప్పారు.

వారు ఇంకా వేష భాషలు సంస్కృతికీ, చరిత్రకూ చిహ్నాలు. వాటిని సక్రమమైన పంథాలో ఉండేలాగు చేయమని ఒక చిన్న కథ రూపంలో వ్యక్తపరుస్తూ తమ ఉపన్యాసం ముగించారు.

సభానంతరం చీరాల వి. ఆర్. యస్. కళాశాలవారు ఆత్రేయ రచించిన ఎన్. జి. వో. గుమాస్తా నాటకం ప్రదర్శించారు.

ఖమ్మంజిల్లా ప్రథమ విద్యార్థి మహాసభ

ఖమ్మం, డిసెంబరు 17

ఖమ్మంజిల్లా విద్యార్థి మహాసభ ఇచ్చట శ్రీ కె. రామదాసుగారి అధ్యక్షతను జరిగింది. ప్రతినిధులుగా ఖమ్మం హైస్కూలు నుంచి తప్ప జిల్లాలోని వివిధ తాలూకాలకు చెందిన హైస్కూలు విద్యార్థి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు 60 మంది విచ్చేశారు. పలువురు విద్యార్థి ప్రతినిధులు ప్రసంగించాక ఈ క్రింది నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది.

అధ్యక్షులు: శ్రీ చావా శివకోటి (ఖమ్మంకాలేజి), ఉపాధ్యక్షులు: శ్రీ కె. రామదాసు (ఇల్లెందు), కార్యదర్శి: శ్రీ ఎ. రాఘవయ్య (మధిర), సహాయ కార్యదర్శులు: శ్రీ కె. సత్యం (వైరా), జె. కృష్ణారెడ్డి (బనిగండ్లపాడు) కార్యవర్గ సభ్యులు: శ్రీయుతులు కె. నరసయ్య (కొత్తగూడెం), డి. వెంకటనరసయ్య (కల్లూరు), జి. భీమారావు (గోకినేపల్లి)' ఎస్. గోపాలరెడ్డి (సిరిపురం), కె. వెంకటసోమరాజు (మల్లపాడు), కె. వెంకటేశ్వర్లు (నిధానపురం), పాండురంగారావు (నేలకొండపల్లి).

ఈ మహాసభ ద్వారా వివిధ రకాల అభిప్రాయాలకు చెందిన విద్యార్థులు ఓంప్రథమంగా సమావేశమై విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మార్గం చూపినట్లు భావించబడ్తోంది. విద్యార్థుల మధ్య ఐక్యత సృష్టించి సమిష్టి ఆలోచనల ద్వారా పాఠ్యప్రణాళిక, విద్యావిధానంలో మార్పులు, స్కూలుఫీజు, హాస్టలు సౌకర్యం మున్నగు సమస్యలపై కేంద్రీకరించి పనిచేయాలనే కార్యదీక్ష విద్యార్థుల్లో ఆవిర్భవించినట్లు మహాసభ చర్చల సరళి ఉపన్యాసాల ధోరణివల్లనిరూపితమవుతోంది. (వి.వి)

భద్రాచలం ఉత్సవాలు: అధికార్ల బాధ్యత

దుమ్ముగూడెం, డిసెంబరు 18

భద్రాచల క్షేత్రంలో జరగు ముక్కోటి ఉత్సవాలకు వచ్చేయాత్రికుల సౌకర్యార్థం స్థానికాధికార్లు ఈ క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసన సభ్యురాలు శ్రీమతి వాణీ రామారావుగారు ఇలా ప్రకటిస్తున్నారు.

రేవులవద్ద పడవ ఎక్కుటకు ముందుగా టిక్కెట్లు అమ్మేపద్ధతి ప్రవేశపెట్టాలి. పడవలలో పట్టునంతవరకే ప్రజలను ఎక్కించుకోవాలి అనగా పడవ కెపాసిటీకి మించి టిక్కెట్లు అమ్మకుండా చూడాలి. కావలసినన్ని పడవలను ముందుగానే జాగ్రత్త చేయించి యుంచాలి. ముఖ్యంగా రేవుల వద్ద స్కౌట్ల సహాయంతో పోలీసు బందోబస్తు గట్టిగా ఏర్పాటుచేయాలి. ఉత్సవములు అయేంతవరకూ పడవలను తరచు తనిఖీ చేయుచుండాలి.

యాత్రికులు కూడా పై విషయములను దృష్టియందుంచుకొని ప్రభుత్వోద్యోగులతో సహకరించి కావలసిన సదుపాయములు పొందగలరని ఆశించుచున్నాను.

సభలు-సమావేశాలు

నర్సాపురం కళాశాల పూర్వ విద్యార్థిసంఘం వార్షికోత్సవం ఈనెల 25 వ తేదీన జరుగుతుంది.

◆ ◆ ◆

భీమవరం తాలూకా ఉండి ఫిర్కా నాయీ బ్రాహ్మణ ప్రథమ మహాసభ ఉండిలో ఈ నెల 29వ తేదీన జరుగుతుంది.

◆ ◆ ◆

కడపలో ప్రజాసమాజ్ వారి ఆధ్వర్యాన ఈనెల 25 నుంచి 31 వ తేదీ వరకు 'ప్రజా సంక్షేమవారం' జరుగుతుంది.

ఉర్దూ కవిసమ్మేళనం

కడప, డిసెంబరు 16

కడపలో ఈ నెల 6 తేది నుండి 10 తేదీ వరకు జరిగిన ఉరుసు సందర్భంలో 8 వ తేదీన ప్రత్యేకంగా నిర్మింపబడ్డ మండపంలో 13వ 'ముషాయిరా' (కవిసమ్మేళనము) ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి డాక్టర్ బి. గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జరిగింది. సభకు వివిధ ప్రదేశాలనుంచి వందమందికిపైగా వుర్దూ కవులు విచ్చేశారు. కవులు తమ తమ రచనలు చదివి వినిపించారు.

తెనాలి మాస్టర్ ప్రింటర్సు అసోసియేషను

తెనాలి, డిసెంబరు 10

తెనాలి మాస్టర్ ప్రింటర్సు అసోసియేషన్ ఈ నెల 8 వ తేదీన తెనాలిలో శ్రీ దాసరి కాళిదాసుగారి అధ్యక్షతన సమావేశమై ప్రింటింగుచార్జీలను గురించి ప్రభుత్వంతో రాయబారములు జరుపుటకు, అసోసియేషన్‌ను కోఆపరేటివ్ సొసైటీల చట్టం క్రింద రిజిస్టరు చేయుటకు తీర్మానించారు. (వి. వి.)

కొత్తపేట తాలూకా పార్టీ పునర్నిర్మాణం

460 మంది కమ్యూనిస్టుపార్టీలో సభ్యులుగా చేరుతూ ప్రమాణ స్వీకారం

కొత్తపేట, డిసెంబరు 18

తూర్పుగోదావరిజిల్లా కొత్తపేట తాలూకాలో పార్టీ పునర్నిర్మాణ కార్యక్రమ సందర్భంలో యింతవరకు 22 గ్రామాలలో పార్టీ శాఖలు ఏర్పాటు చేయబడ్డాయి. 460 మంది సభ్యులు పార్టీలోచేరుతూ ప్రమాణం స్వీకారం చేశారు. 15 వ తేదీన కొత్తపేట తాలూకా కమిటీ సమావేశమై యిప్పటివరకు జరిగిన కార్యక్రమాన్ని సమీక్ష చేసి ఈ నెలాఖరులోగా మరో 8 గ్రామాలలో పార్టీ శాఖలు ఏర్పాటు చేయాలని తాలూకా సభ్యత్వాన్ని 600 వరకు పెంచాలని నిర్ణయించింది. పార్టీ సభ్యత్వం స్వీకరించిన గ్రామాల వివరాలు:

ఆత్రేయపురం: యిప్పటికి 30 మందిసభ్యులతో పార్టీశాఖ ఏర్పాటు చేయబడింది. శ్రీ మందునూరి సుబ్బరాజుగారు గ్రామశాఖ కార్యదర్శి.

కొమరాజు లంక: 20 మంది పార్టీలో చేరుతూ ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీ ముత్యాల చిన నాగేశ్వరరావు కార్యదర్శిగా ముగ్గురితో గ్రామ కమిటీ ఎన్నుకోబడింది.

ఊబలంక: 6 గురు పార్టీలో సభ్యులుగా చేరుతూ ప్రమాణం స్వీకరించారు.

ఏనుగులమహాల్-మండపల్లి: పార్టీ శాఖ 38 మంది సభ్యులతో ఏర్పాటు చేయబడింది. శ్రీ నలాది శ్రీరామమూర్తిగారు కార్యదర్శిగా 5 గురితో కమిటీ ఎన్నుకోబడింది.

కొత్తపేట: యింతవరకు 22 మంది పార్టీలో చేరుతూ ప్రమాణం స్వీకరించారు. శ్రీ సిద్ధంశెట్టి సత్యనారాయణగారు శాఖ కార్యదర్శి.

గోపాలపురం: 21 మంది పార్టీలో చేరారు. గ్రామశాఖ సమావేశమై పార్టీలో యింకా చేర్చుకోవలసిన 10 మందిని చేర్పించేందుకు కార్యక్రమం తీసుకున్నారు.

దేవరపల్లి: యిదివరకు పార్టీ యూనిట్ లేదు. 14 మంది పార్టీ సభ్యులతో గ్రామశాఖను క్రొత్తగా ఏర్పాటుచేయుట జరిగింది.

నరేంద్రపురం: 12 మంది పార్టీ సభ్యులతో పార్టీశాఖ నూతనంగా ఏర్పాటు చేశారు.

మోడేకుర్రు: యిప్పటికి 20 మంది పార్టీలో చేరుతూ ప్రమాణస్వీకారం చేసారు.

కొత్తపాలెం - గుబ్బలవారిపాలెం: ఈ గ్రామాల్లో యింతవరకు 16 మంది పార్టీలో చేరుతూ ప్రమాణస్వీకారం చేశారు. క్రొత్తగాపార్టీశాఖ ఏర్పాటు చేయబడింది.

గంటిపెదపూడి: యింతవరకు 15 మంది పార్టీలో చేరుతూ ప్రమాణ స్వీకారం చేశారు.

గంటిపల్లిపాలెం: 12మందిపార్టీలో సభ్యులుగా చేరారు.

క. పెదపూడి: 14 మందిసభ్యులు పార్టీలో చేరుతూ ప్రమాణ స్వీకారం చేశారు.

ఇసుకపూడి: 25 మంది సభ్యులతో పార్టీశాఖ ఏర్పాటు చేయబడింది.

ముంగండ: 6 గురు సభ్యులు ప్రమాణ స్వీకారంచేశారు.

ముంగుఖరం కొట్టు: 10 మంది సభ్యులతో గ్రామశాఖ ఏర్పాటుచేయబడింది. భమిడి వెంకటకృష్ణయ్యగారు కార్యదర్శి.

చిరతపూడి: 12 మందితో పార్టీ శాఖ ఏర్పాటు చేయబడింది.

ఏనుగపల్లి: 15 మంది సభ్యులతో గ్రామశాఖ ఏర్పాటు చేయబడింది.

కట్టుంగ గ్రామంలో 18 మంది, గన్నవరంలో ఇద్దరు, పొడగట్లపల్లిలో ఒకరు, ఊబుమూడిలో ఒకరు, బెల్లంపూడిలో ఒకరు పార్టీలో సభ్యులుగా చేరారు. వానపల్లి, లక్ష్మీపోలవరం, బిళ్లకుర్యాలి, పుల్లేటికుర్రు, [illegible], పేరవరం, వాడపల్లి గ్రామాలలో పార్టీశాఖలు ఏర్పాటు చేయవలసివుంది.

రాజమండ్రి

శ్రీ మధ్య సూర్యారావుగారి అధ్యక్షతను రాజమండ్రిపట్టణ కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సమావేశం ఈనెల 15 వ తేదీన జరిగింది. పట్టణ కమిటీ కార్యదర్శి శ్రీ చిట్టూరి ప్రభాకర చౌదరి కమిటీ నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశం నివేదికను చర్చించి, సవరించి ఆమోదించింది. అనంతరం రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ మోటూరు హనుమంతరావుగారు జాతీయఅంతర్జాతీయ పరిస్థితుల్ని గురించీ, పార్టీ పునర్నిర్మాణాన్ని గురించీ పార్టీ తీసుకుంటున్న వైఖరిని వివరించారు.

సాయంత్రం శ్యామానందఘాట్‌లో కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన శ్రీ చిట్టూరి ప్రభాకరచౌదరి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది. సభలో రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ మోటూరు హనుమంతరావుగారు జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల్ని వివరించారు. అమరజీవి పొట్టి శ్రీరాములుగారికి జోహార్లర్పించారు.

ఏలూరు సెంట్రల్ బ్యాంకు ఎన్నికలు

శాసన సభ్యులైన అల్లూరి బాపినీడుగారి అసభ్య ప్రసంగానికి ఆక్షేపణలు

['విశాలాంధ్ర' విలేఖరి]

ఏలూరు, డిసెంబరు 19

ఏలూరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు షేర్‌హోల్డర్లనుండి షేర్ హోల్డర్ డిపాజిటర్లనుండి డైరెక్టర్లను ఎన్నుకొనుటకు, 1956-57 సాలునివేదిక నామోదించుటకు మార్టేరు బ్రాంచి ఆఫీసులో మొన్న వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జరుగనున్న ఎన్నికల సందర్భంలో ప్రస్తుతం బ్యాంక్ పాలకవర్గంలో నున్న వారిని ఓడించాలనే తాపత్రయంతో జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు అల్లూరి బాపినీడు, కాంగ్రెసు ఎం. ఎల్. ఎ. మూర్తిరాజు, ఏలూరుతాలూకా భూస్వామి గారపాటి చినవెంకయ్య వగైరాలు భూరిప్రయత్నాలు సాగించారు. ఎన్నికలకు 3, 4 రోజుల ముందునుండి మూర్తిరాజుగారు ప్రత్యేకంగా ఒక జీపుమీద అనేకగ్రామాలు తిరిగిచాలా మంది పెత్తందార్లను కూడగట్టి పెద్ద హడావుడిచేశారు. ఈయన ధ్యేయం వారి గ్రామానికి చెందిన శ్రీ వడింపల్లి విశ్వనాథరాజుగారనే డైరెక్టర్‌ను ఓడించడం అని బాహాటంగానే చెప్పుతున్నారు.

ఈసమావేశానికి సెంట్రల్ బ్యాంకు చరిత్రలో ఎన్నడూ రానంతమంది ప్రతినిధులు హాజరయ్యారు. చివరకు మధ్యాహ్నం 2 గంటలకు బ్యాంకు అధ్యక్షులు శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడుగారి అధ్యక్షతను సర్వసభ్య సమావేశంజరిగింది. అధ్యక్షులు సాలుసరి నివేదికనుప్రవేశపెట్టారు. దానిపై జరిగే చర్చను పురస్కరించుకుని శ్రీ మూర్తిరాజుగారు తాను గత రెండు సంవత్సరాలుగా ఒక మార్పు కోసం కృషి చేస్తున్నానని, అది జరగటం లేదని, అందుకే తాను ఈ కో-ఆపరేటివ్ ఉద్యమంలో అడుగు పెట్ట దలచానని చెపుతూ తాను జరుగనున్న ఎన్నికలలో పోటీచేయ దలచినట్లు చెప్పారు.

ఎన్నికలు చేతులు ఎత్తుటద్వారా జరగాలా లేక బాలెట్ పేపర్లు తయారుచేసి వాటిద్వారా జరగాలా అనే విషయం జనరల్ బాడీ నిర్ధారణ చేయాల్సిఉంది. దానిపై కొంత తర్జన భర్జనలు జరిగాక చివరకు చేతులు ఎత్తి అభిప్రాయాలను ప్రకటించటం ద్వారా ఎన్నికలు నిర్వహించబడాలని నిర్ధారణ చేశారు. ఆపై పాతపాలకవర్గంలో డైరెక్టర్లుగానున్న శ్రీ మాగంటి రాఘవేంద్రరావు, మోచర్ల విద్యన్న పంతులు, వడింపల్లి విశ్వనాథరాజు, దాసంసత్యనారాయణమూర్తి, బొబ్బిలి అప్పారావుగార్లను ఒకరు సూచించగా శ్రీ మోచర్ల విద్యన్న పంతులు, మాగంటి వీరరాఘవేంద్రరావు (తండ్రి సుబ్రహ్మణ్యం), మూర్తిరాజు, తోట కృష్ణమూర్తిగార్ల పేర్లను వేరొకరు సూచించారు. ఆమీద కొంతసేపు రాయబారాలు సాగించి వాతావరణం సుముఖంగా లేనందున చివరకు మూర్తిరాజుగారి గ్రూపు విరమించుకొందలచారు. ఆ విషయం ప్రకటించటానికి లేచి జిల్లాకాంగ్రెసు అధ్యక్షుడు, కాంగ్రెస్ శాసనసభ్యులు అయిన అల్లూరి బాపినీడు బి. ఏ. బి. యల్. గారు మాట్లాడుతూ "చేతులు ఎత్తి ఎన్నికలు జరుపుకోవాలనే సరదా ఉంటే అది వేరేచోట తీర్చుకోటం మంచిది కాని ఇక్కడ కాదు" అన్నారు.

"ఎన్నికలుజరుపుకోవాలనే సరదా ఎవరికీ లేదని, అది ఏమన్నా ఉంటే బాపినీడుగారిలాంటి వాళ్లకే ఉందని" సభికులు కేకలువేశారు. దాంతో శ్రీ బాపినీడుగారు రెచ్చిపోయి, "మీలో కొందరు చీడపురుగుల్లాగా సంఘాలను అంటిపెట్టుకుని వదలటానికి ఇష్టంలేక ప్రాకులాడుతున్నారు" అన్నారు. ఈ అసభ్య ప్రసంగానికి, ముఖ్యంగా 'చీడపురుగు' పదాన్ని ప్రయోగించినందుకు మొత్తం సభికులందరూ ఒక్కుమ్మడిగా బాపినీడుగారిని నిరసించారు. "ప్రతీ పదవికి ఎగబడే బాపినీడుగారికి ఇతరులను ఆక్షేపించే అర్హతలేదు, ప్రతి తడవా జిల్లా కాంగ్రెసు అధ్యక్షస్థానం తనకే కావాలనే బాపినీడే చీడపురుగు, సభ్యత నెరుగని బాపినీడును బైటకు పంపండి" లాంటికేకలతోనూ "బాపినీడు షేమ్ షేమ్" అను అరుపులతోనూ సభ అల్లకల్లోలమైంది. తాను మాట్లాడినది పొరపాటేనని ప్రకటించటానికి బాపినీడుగారు లేచినా సభికులు సహించక ఆయనను ఎంతసేపటికీ మాట్లాడనీయ లేదు. సుమారు 30, 40 నిముషాలు ఈ విధంగా బాపినీడుగారిని గేలిచేసిన తర్వాత చివరకు పెద్దలందరూ పూనుకొని ఆయన క్షమాపణ చెపుతూన్నప్పుడైనా ఊరుకోకపోతే బాగుండదని నచ్చచెప్పారు. దానిపై క్రమంగా సభలో ప్రశాంతత నెలకొన్నది. ఆ పిమ్మట మూర్తిరాజుగారు తనతోబాటు పోటీచేయ సంకల్పించిన వారితోటి తనకు మద్దతుగా వచ్చిన గారపాటి చినవెంకయ్య లాంటి వాళ్ళతోటి సంప్రదించి ఉపసంహరించుకున్నారు. పాత పాలకవర్గంలోనివారే ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

తర్వాత కార్యక్రమం ఎజెండా ప్రకారం కొనసాగింది.

డిటెన్షన్ చట్టం మనదేశ సంప్రదాయాలకు విరుద్ధం

పొడిగింపు బిల్లుపై రాజ్యసభ చర్చలో శ్రీ భూపేష్‌గుప్త విమర్శ

న్యూఢిల్లీ, డిసెంబరు 19

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని మరో మూడేళ్ళపాటు పొడిగించే బిల్లుపై రాజ్యసభ నేడు చర్చ జరిపింది. ఈ బిల్లును ఇదివరకే లోకసభ ఆమోదించింది.

హోంమంత్రి శ్రీ గోవిందవల్లభపంత్ బిల్లును ప్రతిపాదిస్తూ, ఉత్తలాది ప్రజల స్వేచ్ఛను కాపాడ్డానికి, దేశ స్వాతంత్ర్యాన్ని, భద్రతను రక్షించడానికి డిటెన్షన్ చట్టాన్ని కొనసాగించడం అవసరమని చెప్పారు. దేశ భద్రతకు అంత ప్రమాదం లేకపోయినప్పటికీ కల్లోలాలు కల్పించదలిచే శక్తులు పరిసరాల్లో వున్నాయి. జమ్మూ-కాశ్మీర్లో బాంబు ప్రేలుళ్ళను, అక్కడికి ప్రవహిస్తున్న ధనాన్ని అరికట్టవలసి వుంది. అందుకు ప్రత్యేక చర్యలు అవసరమని చెప్పారు.

కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్ గుప్త మాట్లాడుతూ యీ చట్టం దేశ సంప్రదాయాలకు, చరిత్రకు, రాజకీయ అవగాహనకు వ్యతిరేకంగా వుందన్నారు. ఇలాంటిచట్టం స్వాతంత్ర్య ప్రజాతంత్ర సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైనది. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కాపాడ్డానికి ఇలాంటిచట్టం అవసరంలేదు అని ఆయన అన్నారు. మొదట ఈ చట్టం చేసినపుడు, త్వరలోనే దానిని ఉపసంహరిస్తారనుకున్నారని, కాని పదే పదే దీని పొడిగిస్తున్నారని శ్రీ గుప్త పేర్కొన్నారు. ఇప్పుడు చూస్తే కాంగ్రెసు పార్టీకి సంబంధించినంతవరకూ, ఈ చట్టం శాశ్వతంగా నిలిచిపోయ్యేట్లు కనబడుతోందన్నారు.

శ్రీ గుప్త తన ప్రసంగం ముగించే సమయానికే సభ వాయిదా పడింది.

కేరళ భూసంస్కరణ బిల్లులో మరికొన్ని వివరాలు

తిరువనంతపురం, డిసెంబరు 20

భూమిపై మధ్యదళారీలను తొలగించేందుకు వీలుగా కేరళ వ్యవసాయ సంస్కరణల బిల్లులో కొన్ని నిబంధనలను పొందుపర్చారు.

కేరళ ప్రభుత్వం ప్రతిపాదించిన భూసంస్కరణల బిల్లు తాలూకు కొన్ని వివరాలను నిన్న మేం ప్రకటించాం. బిల్లులో ఉన్న మరికొన్ని వివరాలు ఇవి:

కౌలుదారు భూమిని కొన్నట్టు నిర్ణయించిన తేదీలగాయతు కొన్నధర మీద సంవత్సరానికి 5% వడ్డీ పెరుగుతుంది. కొన్నధర పూర్తిగా చెల్లించిన పిమ్మట ల్యాండ్ బోర్డు వారు కౌలుదారుకు క్రయం సర్టిఫికేట్ యిస్తారు. దీనితో కౌలుదారు భూమి క్రయం పొందినట్టు స్థిరపడుతుంది.

ఈవిధంగా క్రయం చేసినట్టు నిర్ణయించిన భూములకు నష్టపరిహారంగా గరిష్ఠకౌలురేటుపై 16 రెట్ల మొత్తాన్ని భూస్వామి కౌలుదారునుండి పొందటానికి అర్హుడు. నష్టపరిహారం మొత్తమంతా ఒకేసారి చెల్లించడానికి కౌలుదారు సంసిద్ధపడితే మొత్తంలో 75% చెల్లించితే చాలు.

అయితే ధర్మదాయ దేవాదాయ సంస్థలు, పబ్లిక్ ట్రస్టుల భూములను కౌలుకుచేసేవారికి, ఆ ఫలసాయం పూర్తిగా ఆ సంస్థలకే వినియోగపడుతున్న పక్షంలో క్రయంపొందేహక్కు వర్తించదు.

భూస్వామికి, వాస్తవంగా భూమిని దున్ని సాగుచేసే కౌలుదారుకు మధ్య మధ్యవర్తిగా దళారి ఉన్నట్టయితే అట్టి దళారీలు భూమి కౌలుకు సంబంధించిన తమ హక్కును, వెంటనే అమ్మివేయవలసి ఉంటుంది.

ప్రభుత్వం ప్రకటించిన ఒకానొక తేదీ తరువాత ఏ భూస్వామి కాని, ఏ కౌలుదారుగాని గరిష్ఠ పరిమితికి మించి భూమి కల్గిఉండరాదు. ఆ విధంగా అదనపు భూమిని కల్గిఉంటే నిర్ణీతతేదీలోగా ఆభూమిని ప్రభుత్వానికి స్వాధీనపరచాలి, ఈ విధంగా స్వాధీనపరచిన భూమికి, నిర్ణయించిన రేట్లప్రకారం నష్టపరిహారాన్ని చెల్లిస్తారు.

ల్యాండుబోర్డు భూమి లేనివారికి వరస ప్రాధాన్యాన్నిబట్టి భూములను పంచుతుంది. బిల్లునిబంధనలననుసరించి భూస్వామి స్వంత సాగుకుగాను భూమినితీసుకుంటే అట్టి కౌలుదారుకు పంపకంలో ముందు ప్రాధాన్యమిస్తారు. బిల్లులో నిబంధనల ప్రకారం ఏ భూస్వామియైనా తన భూమిపై హక్కు కోల్పోతే అట్టివారికి రెండవ ప్రాధాన్యమిస్తారు. ఆ తరువాత సహకార వ్యవసాయ సంఘాలకు, ఆ తరువాత వ్యవసాయ కూలీలకు, ఆతరువాత కాడిగట్టు రైతులకుపంచుతారు. ఈవిధంగా పంచేభూమి రెండు పంటలు పండేదైతే అయిదెకరాలు, లేదా తత్తుల్యమైన భూమిని మించి యివ్వరు.

ల్యాండ్ ట్రిబ్యునల్ ఉత్తర్వులపైగాని, నష్టపరిహార ఉద్యోగి లేదా ల్యాండ్ బోర్డు నిర్ణయాలపైగాని బిల్లులో పేర్కొన్నవిధంగా తప్పితే ఏకోర్టులకూ వెళ్ళడానికి వీలులేదు.

నష్టపరిహారం, భూమి క్రయం ధర బిల్లు ప్రకారం యీ విధంగా వుంటాయి: ఆయా తరహా భూములకు గరిష్ఠరేట్ల ప్రకారం నిర్ణయించిన కౌలు రేటుకు మొదటి అయిదెకరాలకు 16 రెట్లు, తరువాత అయిదెకరాలకు 14 రెట్లు, తరువాత అయిదెకరాలకు 12 రెట్లు, తరువాత ముప్ఫై ఎకరాలకు 10 రెట్లు, తరువాత యాభై ఎకరాలకు 8 రెట్లు, తరువాత యాభై ఎకరాలకు 6 రెట్లు, వంద ఎకరాలకు మించితే 5 రెట్లు.

9

పారిస్, డిసెంబరు 1

అట్లాంటిక్ కూటమిలోని 15 దేశాలకు ఈఏడు, సైనిక కార్యకలాపాలకు 2,109 కోట్ల పౌనులు ఖర్చవుతుందని, కూటమి అధికార పూర్వ, అంచనా తెలుపుతోంది.

ఢిల్లీ ఉపాధ్యాయుల సమ్మె నిర్ణయం

లోకసభలో వాయిదా తీర్మానం త్రోసివేత

న్యూఢిల్లీ, డిసెంబరు 19

ఢిల్లీలోని 15 వేల మంది ఉపాధ్యాయులు సమ్మె చేసే ప్రమాదం ఏర్పడినందున దీనిగురించి చర్చించాలని నేడు లోకసభలో ప్రతిపాదించబడిన ఒక తీర్మానాన్ని స్పీకరు త్రోసివేశారు. తమ కోర్కెలు నెరవేరనందున ఉపాధ్యాయులు ఈ సమ్మె తలపెట్టారని తీర్మాన ప్రతిపాదకులు తెలియజేశారు. అందుపై విద్యాశాఖ ఉపమంత్రి శ్రీమాలి మాట్లాడుతూ, పత్రికలలో అటువంటివార్త పడినప్పటికీ ప్రభుత్వానికిమాత్రం సమ్మె నోటీసేమీ రాలేదన్నారు. కొలది నెలల క్రితం ఉపాధ్యాయులు తమ కోర్కెలపై ఒక మెమొరాండం సమర్పించారనీ, అందులో కొన్ని కోర్కెలను ప్రభుత్వం అంగీకరించిందనీ కొన్నింటిని నిరాకరించిందనీ అన్నారు.

తీర్మాన ప్రతిపాదకులలో ఒకరైన శ్రీ హేమబారువా మాట్లాడుతూ ప్రభుత్వంపై ఉపాధ్యాయులు చాల తీవ్రమైన ఆరోపణలు చేశారనీ, తమ కోర్కెలపై ఒక ట్రిబ్యునల్ నియమించాలని వారు కోరుతున్నారనీ అన్నారు.

సంప్రదింపులు జరుగుతుండగా వాయిదా తీర్మానాలపై చర్చ పెడితే అది సమ్మెకు దోహదం కావచ్చుననీ అందుచేత తీర్మానాన్ని చర్చకు అనుమతించబోమనీ స్పీకరు అన్నారు.

కేంద్రఉద్యోగులకు తాత్కాలిక సాయం

అసంతృప్తికరమని శ్రీ నాథ్‌పాయ్ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 18

కేంద్రఉద్యోగులకు తాత్కాలిక సహాయంగా ప్రభుత్వం చెల్లించడానికి నిర్ణయించిన మొత్తం చాల అసంతృప్తికరంగా వున్నదని కేంద్రప్రభుత్వోద్యోగుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీ నాథ్‌పాయ్ అన్నారు.

ఆయన నేడొక ప్రకటనచేస్తూ ఆర్థికమంత్రి ప్రకటన తనకు తీవ్రమైన ఆశాభంగాన్ని కలిగించిన దన్నారు.

కేరళ మంత్రులపై దాడి తలపెట్టిన దుండగులు

కేసులు జరుగుతున్నట్లు మంత్రి వెల్లడి

తిరువేంద్రం, డిసెంబరు 19

కేరళవిద్యామంత్రి శ్రీముండస్సెరి, పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ టి. ఎ. మజీద్‌గార్ల పర్యటనలు జరుపుతుండగా వారిపై దౌర్జన్యం చేయబోయిన దుండగులపై రెండుకేసులు విచారణలో ఉన్నాయని న్యాయశాఖామంత్రి శ్రీ వి. ఆర్. కృష్ణయ్యరు నేడు శాసనసభలో తెలియజేశారు. న్యాయవిరుద్ధమవుతుంది గనుక మిగిలిన వివరాలను ఇప్పుడు చెప్పనని మంత్రి అన్నారు. రెవెన్యూమంత్రి శ్రీమతి గౌరినీ, తననూ అదే విధంగా నిరోధించిన నేరాలకు మరి రెండు కేసులు జరుగుతున్నాయని కూడా కృష్ణయ్యరు తెలియజేశారు.

అఖిల భారత పాత్రికేయుల మహాసభ వాయిదా

ఫిబ్రవరి మూడోవారానికి

న్యూఢిల్లీ, డిసెంబరు 18

జనవరి 4, 5, 6 తేదీలలో జయపూర్లో జరుగవలసిన అఖిల భారత పాత్రికేయుల సమాఖ్య మహాసభ ఫిబ్రవరి మూడోవారానికి వాయిదా వేయబడిందని తెలుపుతూ నేడొక పత్రికా ప్రకటన వెలువడింది.

పాత్రికేయుల చట్టంపై కోర్టులో తీర్పు త్వరలో చెప్పే అవకాశం లేదు కాబట్టి మహాసభను వాయిదా వేయవలసి వచ్చిందని ఆ ప్రకటనలో తెలిపారు.

కొత్త సోవియట్ రాయబారి

రాష్ట్రపతికి అధికార పత్రాల సమర్పణ

న్యూఢిల్లీ, డిసెంబరు 19

భారతదేశంలో సోవియట్ రాయబారిగా నియమితులైన పి. కె. పొనమరెంకో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌కు నేడు తన అధికారపత్రాలు సమర్పించారు.

రష్యా, ఇండియాలమధ్య దృఢమైన స్నేహ సహకారాలు నెలకొన్నవని రాయబారి తెలిపారు. భారత మహాజనులపట్ల సోవియట్ ప్రజలకు ప్రగాఢమైన గౌరవం, స్నేహభావం వున్నవని చెప్పారు.

సోవియట్ భారతదేశాల మధ్య రాజకీయ ఆర్థిక సాంస్కృతిక సహకారాన్ని దృఢపర్చడం, ఉభయదేశాల ప్రజల ప్రయోజనాలకు తోడ్పడమేగాక, ప్రపంచమంతటా శాంతి రక్షణకు ఉపకరించగలదని, సోవియట్ ప్రభుత్వం విశ్వసిస్తున్నట్లు ఆయన చెప్పారు.

సోవియట్ మహిళా ప్రతినిధి వర్గం

23 న హైద్రాబాద్‌కు రాక

హైదరాబాద్, డిసెంబరు 18

హైదరాబాదులో ఈ నెల 25 నుంచి జరుగనున్న అఖిల భారత మహిళా మహాసభకు సోవియట్ యూనియన్ నుంచి ఎనిమిది మంది మహిళలుగల ఒక ప్రతినిధివర్గం తాతియానా మాఖెకోవ్నా జురయేవా నాయకత్వాన ఆ తేదీ మధ్యాహ్నానికి బొంబాయినుంచి హైద్రాబాద్ చేరుకుంటారు. తిరిగి 26 వ తేదీన మద్రాస్ వెళ్ళిపోతారు. (వి. వి)

కేరళలో మొరార్జీదేశాయ్ చేసిన ప్రకటనలు

రాజ్యసభలో కమ్యూనిస్టు సభ్యుల ఆక్షేపణ

న్యూఢిల్లీ, డిసెంబరు 19

కేరళ ప్రభుత్వం విధించిన పన్నులు పారిశ్రామికదారులను నిరుత్సాహ పరుస్తాయని కేంద్ర వాణిజ్య మంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ కేరళ రాష్ట్రంలో చేసిన ప్రకటనను నేడు రాజ్యసభలో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ భూపేష్‌గుప్త, నారాయణ నాయర్, ఎస్. సి. శేఖర్‌లు ఆక్షేపణ వెల్లడించారు. శ్రీ దేశాయ్ ప్రకటన రాజ్యాంగబద్ధమైన మర్యాదకు విరుద్ధమని, దీనివల్ల విపరిణామాలు సంభవిస్తాయని వారన్నారు. పన్నులు తక్కువగావున్న మైసూరు రాష్ట్రానికి కేరళ తోట యజమానులు తరలిపోవాలని శ్రీ మొరార్జీ సలహా ఇచ్చినట్లే దీని అర్థం. కాంగ్రెసుపార్టీ ఇలాంటి ప్రచారం చెయ్యడానికి తన కార్యకర్తలను కేరళకు పంపివుంటే అది వేరేవిషయం. కాని శ్రీ దేశాయ్ అధికార కార్యక్రమంమీద, కేంద్ర మంత్రిగా కేరళకు వెళ్ళారు అని వారు వివరించారు.

శ్రీ టి. టి. కృష్ణమాచారి ఇలా సమాధానం చెప్పారు:

"శ్రీ దేశాయ్ ఆ విధంగా చెప్పలేదు. తోట యజమానులు పన్నులు హెచ్చుగా వున్నవని ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

ఆయన స్వంత అభిప్రాయాన్ని వెల్లడించలేదు. తానువిన్నదిచెప్పారు. నా సహచరునికి ప్రజా జీవితంలో చాలా అనుభవం వుంది. రాష్ట్రప్రభుత్వాలతోనూ, అధికారులతోనూ వ్యవహరించడంలో ఆయన చాలఖచ్చితంగా వుంటారు. నేనిపుడు చెప్పిన విషయాన్ని సభ్యులు అంగీకరించాలని కోరుతాను."

శ్రీ గుప్త: ఆయన అలా చెప్పక పోతే, నాకు సంతోషమే. కాని శ్రీ దేశాయ్ ఆ విధంగా పత్రికా గోష్ఠిలో చెప్పినట్లు హిందూ పత్రిక రాసింది.

శ్రీ కృష్ణమాచారి: తనకు ఫలానా విధంగా ఫిర్యాదులు వచ్చాయని శ్రీ దేశాయ్ చెప్పగా, అది ఆయన అభిప్రాయమైనట్లు చిత్రించారు. అది సరికాదు. ఈ దురభిప్రాయాన్ని నేను విడదుర్చదలచాను.

◆

మధ్యప్రదేశ్ నుండి బియ్యం ఎగుమతులపై భారత ప్రభుత్వం ఆంక్షలను విధించింది.

అట్లాంటిక్ కూటమి ప్రకటన

(1 వ పేజీ తరువాయి)

కొన్ని యూరపియన్ దేశాలకు, ఆఫ్రికాకు మధ్య చాలకాలంగావున్న సంబంధాలు, ఉభయుల మధ్య సహకారాన్ని ఫలవంతం చేయగలవు.

ఉపోద్ఘాతం

ఈ ప్రకటనకు ఒక ఉపోద్ఘాతం కూడా వుంది. దాని సారాంశం ఇది:

(1) ఆయాదేశాల ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వం క్రింద జీవించే హక్కు వుంది. ఆ హక్కును రక్షించడం అట్లాంటిక్ కూటమి లక్ష్యం.

(2) యుద్ధానంతరం పశ్చిమ రాజ్యాలు నిరస్త్రీకరణ చేశాయి. రష్యా చేయలేదు.

(3) అట్లాంటిక్ కూటమి దేశాల ఐక్యత వాటి క్షేమానికి, ప్రపంచ శాంతికి అత్యావశ్యకం.

4. ఈకూటమి ఎన్నడూ దురాక్రమణ చెయ్యదు. అంతర్జాతీయ సమస్యలను సంప్రతింపులద్వారా పరిష్కరించడానికి 15 దేశాలూ కృతనిశ్చయమై వున్నాయి.

5. దశలవారీగా నిరాయుధీకరణ సాధించడం ఈ దేశాల లక్ష్యం. ఈ విషయమై న్యాయమైన ఎట్టి ప్రతిపాదనవైనా చర్చించడానికి వారు సిద్ధంగా వున్నారు.

6. అంతర్జాతీయ పెత్తనానికి ప్రపంచంలో తావులేదు.

7. అంతర్జాతీయ కమ్యూనిజం పెత్తనంలో నివసిస్తున్న దేశాలు ప్రపంచంపై ప్రాబల్యం సాధించాలనే ఆశకు బలిపెట్టబడ్డాయి. వాటి స్వాతంత్ర్య హరణం ఎల్లకాలమూ సాగదు.

8. సాంఘిక, ఆర్థిక పురోగమనాన్ని సాధించడం అట్లాంటిక్ కూటమి లక్ష్యం. తమ వనరులను మరింత చక్కగా ఉపయోగ పర్చడానికి, ప్రత్యేకించి అణుశక్తిని శాంతియుత కార్యాలకు ఉపయోగ పెట్టడానికి 15 దేశాలు సమిష్టి కృషి సాగిస్తాయి.

9. ఇటీవల స్వాతంత్ర్యాన్ని సంపాదించిన దేశాలన్నిటితోనూ సహకరించడానికి, 15 దేశాలూ సంసిద్ధత వెలిబుచ్చుతున్నాయి.

10. ఎవ్వరినీ కవ్వించకుండా, నిర్భీతిగా 15 దేశాలు, తమ ఐక్యతను, బలాన్ని, భద్రతను కాపాడుకోడానికి నిర్ణయాలు తీసుకున్నాయి.

ప్రభుత్వం వద్ద 10 లక్షల టన్నుల ఆహారధాన్యాలు

ప్రస్తుతం నిల్వ ఉన్నట్లు లోక్‌సభలో ఆహారశాఖ ఉపమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 19

ప్రభుత్వం వద్ద 10 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ప్రస్తుతం నిల్వ ఉన్నట్లు నేడు లోకసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆహారశాఖ ఉపమంత్రి శ్రీ ఎ. ఎం. థామస్ తెలియజేశారు.

ఇందులో బియ్యం 2 లక్షల 75 వేల టన్నులు, గోధుమలు 7 లక్షల 12 వేల టన్నులు, ఇతరధాన్యాలు 48 వేల టన్నులు ఉన్నట్లు మంత్రి వివరించారు. క్రమక్రమంగా గోధుమ, బియ్యం చెరొక పది లక్షల టన్నులు నిల్వచేయడమే ప్రభుత్వం విధానమని ఆయన అన్నారు.

"రాష్ట్రాలు, అయిదు లక్షలనుండి ఏడు లక్షల టన్నులవరకు ఆహారధాన్యాల లోటు ఏర్పడవచ్చునని అంచనావేశాయి. ఐతే ఇది సరికాదు. ప్లానింగ్ కమిషన్ నియమించిన కమిటీ అంచనాలనుబట్టి ఈ లోటు ఇంకా తక్కువగా ఉండవచ్చును" అని శ్రీ థామస్ అన్నారు.

తపాలా సేవింగ్స్ బ్యాంకులు

తపాలా సేవింగ్స్‌బ్యాంకు నిబంధనలను సడలించే విషయం ప్రభుత్వం ఆలోచిస్తున్నదనీ, అందువలన సొమ్ము దాచుకొనేవారికి యింకా సౌలభ్యం ఏర్పడుతుందనీ మరో ప్రశ్నకు రవాణాశాఖా మంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి సమాధానం చెప్పారు. ఇందుకై ఒక ప్రత్యేకోద్యోగిని నియమించినట్లు ఆయన తెలియజేశారు.

జనతా భీమాపట్టాలు

జీవిత భీమా కార్పొరేషన్ ఈ యేడు మే - నవంబరు నెలలమధ్య రు 79,11,084 విలువగల జనతా భీమా పట్టాలను జారీచేసిందని ఆర్థికశాఖ డిప్యూటీమంత్రి శ్రీ బి. ఆర్. భగత్ రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు. ఈ పట్టాల వలన వచ్చిన నిధి కార్పొరేషన్ నిధిలో ఒకభాగంగా ఉంటుందనీ దానిని భీమాచట్టం ప్రకారం తప్పితే వేరే యితరపనులకు పెట్టుబడిగా వినియోగించలేదనీ అన్నారు.

ఈ డబ్బును ముంద్రా గ్రూపు పరిశ్రమలకు పెట్టుబడిగా వినియోగించడం ప్రభుత్వ విధానమా? అని శ్రీ హెచ్.డి. రాజా అడిగినప్రశ్నకు మంత్రి ఎట్టి సమాధానం యివ్వలేదు. తరువాత అధ్యక్షుడు మరుసటిప్రశ్నకు వెళ్ళారు.

బొంబాయి రాష్ట్రంలో ప్రాథమికోపాధ్యాయుల కరువుభత్యం రు. 40

బొంబాయి, డిసెంబరు 19

బొంబాయి రాష్ట్రంలోని ప్రాథమికోపాధ్యాయులందరికీ నెలకు రు 40/-లచొప్పున కరువుభత్యం యివ్వాలని బొంబాయి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ఫలితంగా విదర్భ ప్రాంతంలోని ప్రాథమికోపాధ్యాయులకు యిప్పుడు ముట్టుతున్న కరువు భత్యం కన్నా అదనంగా నెలకు రు. 20 లు, సౌరాష్ట్రలోనివారికి రు. 10 లు ముట్టుతాయి.

బొంబాయి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలోని ప్రాథమికోపాధ్యాయులకు ఇంతకు పూర్వమే నెలకు రు. 40లు కరువుభత్యం యిస్తున్నారు.

ఫ్రాంకో-డల్లెస్ మంతనాలు

శుక్రవారం మాడ్రిడ్‌లో

మాడ్రిడ్, డిసెంబరు 18

పారిస్‌నుండి అమెరికా తిరిగివెళ్తూ అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ మాడ్రిడ్ వస్తారని నేడిక్కడ అమెరికా - స్పెయిన్ సంయుక్త ప్రకటన ఒకటి వెలువడింది. డల్లెస్ శుక్రవారం వస్తున్నారు.

అఖిలభారత కార్మిక మహాసభలు

ఎర్నాకుళం, మధురైలలో

న్యూఢిల్లీ, డిసెంబరు 20

కేరళరాష్ట్రంలోని ఎర్నాకుళంలో డిసెంబరు 25-29 తేదీలలో జరిగే అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు మహాసభలో రెండోపంచవర్ష ప్రణాళికదృష్ట్యా వేతనాలు, ఉత్పత్తి, కార్మిక క్రమశిక్షణమున్నగు ప్రధాన సమస్యలపై అవలంబించదగు వైఖరిని గురించిచర్చిస్తారనితెలుస్తోంది.

ఈ మహాసభకు దేశం నలుమూలల నుంచీ సుమారు1000 మందిప్రతినిధులు హాజరుకాగలరని భావించబడుతూంది.

కాగా, జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు మహాసభ మధురైలో జనవరి 1, 2 తేదీలలో జరుగుతుంది.

ఎర్నాకుళం మహాసభను కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ ప్రారంభిస్తారు. మధురై మహాసభను కేంద్ర కార్మికమంత్రి శ్రీ నందా ప్రారంభిస్తారు.

కాంగ్రెసులో 'సోషలిస్టు వర్గ' నిర్మాణానికి యత్నం

డిసెంబరు 22 న ఢిల్లీలో సదస్సు

న్యూఢిల్లీ, డిసెంబరు 19

ప్రజాతంత్ర, సోషలిస్టు సిద్ధాంతాలుగల కాంగ్రెసువాదుల బలాన్ని సంఘటితపరచే లక్ష్యంతో కాంగ్రెసులోనే ఒక ప్రత్యేక వర్గాన్ని నిర్మించాలనేప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇందుకోసం వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెసుకార్యకర్తల సదస్సు డిసెంబరు 22, 23 తేదీలలో ఢిల్లీలో జరుగుతుంది.

ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్న వారిలో కేంద్రంలోని కొంతమంది జూనియర్ మంత్రులూ, ప్రముఖ కాంగ్రెసు వాదులూ, కొంతమంది పార్లమెంటు సభ్యులూ వున్నారు. వీరు కాంగ్రెసులో నేడున్న పరిస్థితిని గురించి, ఇకముందు అనుసరించవలసిన పంథానుగురించి తమ కార్యాచరణ ప్రణాళికను ఆ సదస్సులో ప్రవేశపెడతారు.

ఆ ప్రణాళికలో యిలా వుంది:

"కమ్యూనిస్టులు కేరళను తమప్రాతిపదికగా చేసుకొని తక్కిన భారత దేశాన్ని కూడా వశపరచుకోవడానికి యత్నించుచున్నారనేది నిస్సందేహమైన విషయం. ఈ పరిస్థితులలో భారత దేశంలో ప్రజాతంత్ర వ్యవస్థకు కలిగే నిజమైన ప్రమాదాన్ని చూస్తూ కాంగ్రెసువాదులు వూరుకోగలరా" అని ప్రశ్నించారు.

పంజాబు మంత్రివర్గంలో మార్పు లుండవట

ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్‌సింగ్ వెల్లడి

చండీగర్, డిసెంబరు 19

ఎనిమిది మాసాల క్రిందట ఏర్పడిన తన మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు తీసుకొని రాబోవడంలేదని నేడు పంజాబు ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్‌సింగ్ కైరాన్ నేడు పత్రికా గోష్ఠిలో తెలిపారు.

ఆరునెలల తర్వాత నేడు మొదటి సారిగా ముఖ్యమంత్రి పత్రికాగోష్ఠి జరిపారు.

పంజాబు మంత్రివర్గంలో తొమ్మిది మంది సభ్యులున్నారు.

◆

జాతీయ పౌరదళం కేంద్ర సలహా సంఘ సమావేశం డిసెంబరు 28 న జరుగుతుంది.

మొదటి రష్యా స్పుత్నిక్

జనవరి మొదటివారంలో భూ పతనం ?

కాంబ్రిడ్జి (అమెరికా), డిసెంబరు 19

మొదటి సోవియట్ స్పుత్నిక్ జనవరి మొదటివారంలో భూమిమీద పడవచ్చునని స్మిత్‌సోనియన్ ఖగోళ పరిశోధన సంస్థ అధికారి డాక్టర్ ఫ్రెడ్ విపిల్ తెలిపారు.

రష్యా శాంతి ప్రతిపాదనలు

చైనాప్రభుత్వ తోడ్పాటు

హాంకాంగ్, డిసెంబరు 19

సోవియట్ యూనియన్ ఇటీవల చేసిన శాంతి ప్రతిపాదనలను చైనా ప్రభుత్వం పూర్తిగా బలపరుస్తున్నదని, నేడొక ప్రకటన వెలువడింది. ఆయుధాల పోటీని ఆపడానికి, సహజీవనాన్ని ఆచరించడానికి రష్యాచేసిన ప్రతిపాదనలు, చాల ముఖ్యమైనవనీ నిరాయుధీకరణ సమస్యపరిష్కారానికి, అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించడానికి ప్రపంచశాంతిని రక్షించడానికి ఇవి తోడ్పడగలవని ఆ ప్రకటనలో వివరించారు.

శాస్త్రీయ, సైనిక రంగాలలో రష్యాకున్న అగ్రస్థానాన్ని దుర్వినియోగం చేయాలనే ఉద్దేశం సోషలిస్టు దేశాలకు ఏకోశానా లేదని ఈ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో రష్యాసూచనలే! ఏకైక పరిష్కార మార్గాలని పేర్కొన్నారు.

◆

ఈ యేడాదిలో తమ రాష్ట్రంలో మద్యపాననిషేధాన్ని విస్తరింప జేసే సమస్యలేదని ఉత్తరప్రదేశ్ మంత్రి ప్రకటించారు.

రెండో ప్రణాళికపై కేరళ శాసనసభలో చర్చ

తిరువనంతపురం, డిసెంబరు 19

రెండో పంచవర్ష ప్రణాళికక్రింద కేరళలో అమలుజరుప తలపెట్టిన అభివృద్ధి పథకాలను త్వరితంగా పరిపూర్తి చేసే నిమిత్తం కృషి యింకాధిక మొనర్చబడుతుందని ముఖ్యమంత్రిశ్రీనంబూద్రిపాద్ ఈవేళ రాష్ట్ర శాసనసభలో ప్రకటించారు. రెండో ప్రణాళిక కాలంలో కేరళలో జరిగిన అభివృద్ధిపై శాసనసభలో ఈవేళ చర్చ ప్రారంభమైంది. ఈ చర్చను ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి ఇంకా ఇలా తెలియజేశారు:

ఇంతవరకు జరిగిన కృషి రాష్ట్ర ప్రభుత్వానికి సంతృప్తికరంగా లేదు. అయితే 1956-57 సంవత్సరంతో పోల్చుతుంటే, ఈ సంవత్సరం జరిగిన కృషి మెరుగుగానే వుంది.

ఈ సంవత్సరానికి కేరళకు కేటాయించిన మొత్తం రు.17. 90కోట్లలోను, మొదటి 7 నెలలోను రు. 4.21కోట్లు ఖర్చుపెట్ట గలిగాం. ఈ సంవత్సరం పూర్తయ్యేసరికి, అన్ని పథకాలను అమలు జరుపగలమని ఆయన సభ వారికి వాగ్దానం చేశారు.

అభివృద్ధి పథకాలను అమలు జరపటంలో జరుగుతున్న జాగుకు అనేక కారణాలున్నాయి. రాష్ట్రప్రభుత్వ తయారుచేసిన వివిధ పథకాలకు ప్రణాళికా సంఘం ఆమోద ముద్ర పడటం ఆలస్యమవుతోంది. ప్రభుత్వ యంత్రంలోగల లోపాలుకూడా ఈ జాప్యానికి ఒక కారణం.

మెహతాసంఘం సూచనలు

అభివృద్ధి పథకాలను జయప్రదంగా అమలుజరపటానికి బల్వంతరాయ్ మెహతా సంఘంవారు ప్రజాస్వామిక వికేంద్రీకరణ పద్ధతులను సూచించారు. ఈ సంఘం సిఫారసులను అమలు జరిపినప్పుడు పరిస్థితి చక్కబడగలదని శ్రీ నంబూద్రిపాద్ చెప్పారు.

ప్రణాళికను జయప్రద మొనర్చేందుకు ప్రతిపక్షంవారు ప్రభుత్వంతో హృదయపూర్వకంగా సహకరిస్తారని కాంగ్రెసు నాయకుడు శ్రీ పి టి చాకో ఈ చర్చలో పాల్గొంటూ వాగ్దానం చేశారు.

ముస్లింలీగ్ సభ్యుడు శ్రీ మహమ్మద్ కోయా మాట్లాడుతూ, మహమ్మదీయులు ఎక్కువగాగల మధ్య మలబార్ ప్రాంతంలో హెచ్చు అభివృద్ధి పథకాలను అమలు జరిపేందుకు ప్రభుత్వం పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇండోనేషియా ఘటనలపై ఇజ్వెస్తియా వ్యాఖ్య

మాస్కో, డిసెంబరు 19

ఇండోనేషియా జాతీయ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పటిష్ఠం చేసే నిమిత్తమే డచ్చి సంస్థలను స్వాధీనం చేసుకొంటున్నారని సోవియట్ పత్రిక 'ఇజ్వెస్తియా' ఇండోనేషియా ఘటనలపై వ్యాఖ్యానిస్తూ పేర్కొన్నది.

ఇండోనేషియా ఆర్థిక వ్యవస్థలో కీలకమైన స్థానాన్ని ఆక్రమించుకొనివున్నట్టి డచ్చి ప్రయోజనాలను తొలగించకపోతే, ఇండోనేషియా జాతీయ స్వాతంత్ర్యానికే ముప్పు వాటిల్లే ప్రమాదం వుంది గనుక డచ్చి సంస్థలను స్వాధీనం చేసుకుంటున్నారన్నది.

సామ్రాజ్యవాద దేశాలు బడుగు దేశాలను బెదిరిస్తే వడలిపోయేరోజులు గతించాయని ఆ పత్రిక వ్రాసింది.

"ఇండోనేషియా ప్రజలు సాగిస్తున్న పోరాటానికి ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రజల తోడ్పాటు, అజేయమైన సోషలిస్టు శిబిరం అండదండలు గలవన్న విషయాన్ని సామ్రాజ్యవాదులు గుర్తించటం మంచిద"ని ఆ పత్రిక హెచ్చరించింది. సామ్రాజ్యవాదులు తమ శక్తిసామర్థ్యాలను ఎక్కువగా అంచనావేసుకొని ప్రవర్తిస్తున్నారని ఆ పత్రిక తెల్పింది.

పంజాబులో గ్రామోద్యోగుల సమ్మె

చండీఘర్, డిసెంబరు 19

ఎనిమిది రోజులుగా సాగుతున్న పంజాబు గ్రామోద్యోగుల సమ్మెను ఆపడానికి రాష్ట్ర ప్రభుత్వానికీ, గ్రామోద్యోగుల సంఘ ప్రతినిధులకూ మధ్య జరిగిన సంప్రతింపులు నేడు విఫలమైనాయి.

ఈ సంప్రతింపులలో పంజాబు ప్రభుత్వం తరఫున ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సురాజ్‌మల్, గ్రామోద్యోగుల తరఫున సంఘాధ్యక్షుడు శ్రీ ధుంధేర్‌సింగ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి శ్రీ పరమానంద్ పాల్గొన్నారు.

గ్రామోద్యోగుల సంఘ ప్రతినిధి ఒకరు పత్రికలవారితో మాట్లాడుతూ తమవాళ్ళవేతనాన్ని పెంచాలన్న ప్రధాన కోర్కెను ప్రభుత్వం అంగీకరించలేదనీ, అందువలన సమ్మె కొనసాగుతుందనీ తెలిపారు.

డిసెంబరు 12వ తేదీనుండి 12 వేల గ్రామోద్యోగులు (పట్వారీలు) సమ్మె చేస్తున్నారు.



షాక్‌ప్రూఫ్
రేడియం
డయల్
జేబు
గడియారం
రు. 12 లు
మాత్రమే

ఇతర గడియారములకు, మరియు
టైమ్‌పీస్‌లకు, బొమ్మలతోనున్న
మా ఉచిత కేటలాగునకు వ్రాయండి.

Indo-Swiss Corporation,
229, Masjid Bunder Road,
BOMBAY—3

శ్రీకనకదుర్గా గార్డెన్‌హోటల్
మిలటరీ భోజన విశ్రాంతి భవనం.
ఏలూరురోడ్‌సెంటరు
విజయవాడ.2.

మా గార్డెన్‌లో ప్రతిరోజు
సాయంత్రం 4-8 గం॥ల మధ్య
స్పెషల్‌కాఫీ సప్లైచేయబడును.
టీ - డిన్నర్ పార్టీలు
ఏర్పాటు చేయబడును.
MNA

సంపాదకవర్గం. మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి ప్రింటర్ ఎడిటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ - 2.